మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 10 మంగళవారం | అక్టోబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 15

Navabhoomi daily fallows..




# మృత్యుఘోష

- లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై ఇజ్రాయెల్ భీకర వైమానిక దాడులు
- తాజాదాడిలో 100 మంది..మొత్తం వెయ్యి మంది హతం
- 350మందికి పైగా గాయపడినట్లు లెబనాన్ మంత్రి వెల్లడి
- 80 టన్నుల బాంబు దాడితో పెరుగుతున్న మృతుల సంఖ్య

2

**ఇజ్రాయెల్-నవభూమి:** లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై ఇజ్రాయెల్ భీకర వైమానిక దాడులు జరిపింది. తాజా దాడిలో 100 మందికి పైగా మరణించారు. 350 మందికి పైగా గాయపడినట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. శనివారం జరిగిన వైమానిక దాడుల్లో 33 మంది మృతి చెందగా, 195 మంది గాయపడ్డారు. గత రెండు వారాలుగా లెబనాన్‌లో ఐడీఎఫ్ జరుపుతున్న దాడుల్లో మృతుల సంఖ్య మొత్తంగా వెయ్యి దాటినట్లు తెలుస్తోంది.

ఇజ్రాయెల్ హిజ్బుల్లా అగ్రనాయకత్వాన్ని అంతమొందిస్తూ వస్తోంది. సెప్టెంబర్ 27న హిజ్బుల్లా గ్రూప్ చీఫ్ హసన్ నస్రల్లాను చంపేసింది. గత వారంలో వైమానిక దాడుల్లో 7 మంది కీలక కమాండర్‌లను హతమార్చింది. టెర్రర్ గ్రూప్ సెంట్రల్ కౌన్సిల్‌లోని సీనియర్ సభ్యుడు నబిల్ కౌక్‌ను కూడా చంపేశారు.



భీకర దాడులు కొనసాగుతున్నప్పటికీ హిజ్బుల్లా దళాలు ప్రతిఘటిస్తూనే ఉన్నాయి.

**80 టన్నుల బాంబు దాడి..**

శుక్రవారం రాత్రి 9:30కు ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో నస్రల్లా మరణించినట్లు హిజ్బుల్లా శనివారం ప్రకటించింది. బీరుట్‌లోని హిజ్బుల్లా ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ సైన్యం 80



# సిట్ నుంచి సీబీఐకు?

- చంద్రబాబుకు సుప్రీం మరో షాక్
- కల్తీకి సాక్ష్యాల్లేవంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్య
- సీబీఐ విచారణకు సుప్రీం ఆదేశించే అవకాశం?
- వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, బీజేపీ మాజీ ఎంపీ
- సుబ్రమణ్యస్వామి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ

2

**న్యూఢిల్లీ-నవభూమి:** తిరుమల లడ్డూకు వాడిన నెయ్యి కల్తీపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఆయన మెడకు చుట్టుకునేలా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా లడ్డూ కల్తీ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాకుండానే చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు, ఆ తర్వాత సిట్ దర్యాప్తుకు ఆదేశించడంపై సుప్రీంకోర్టు ఇవాళ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అంతే కాదు చంద్రబాబు ప్రభుత్వ సిట్ దర్యాప్తు కొనసాగింపుపైనా గురువారం కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతోంది. తిరుమల లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు చేసిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, బీజేపీ మాజీ

## ఆధారాలు లేవు : సుప్రీం వ్యాఖ్య

**హైదరాబాద్-నవభూమి:** తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. 'లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధారించారా? లడ్డూలను టెస్టింగ్ కు పంపారా? **మిగతా 2లో**

# 9న టీచర్ పోస్టులు

- 11వేల మందికి ఉపాధ్యాయ నిమామక పత్రాలు అందజేత
- బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో 7,857 పోస్టులను మాత్రమే భర్తీ
- కాంగ్రెస్ 30 రోజుల్లోనే 30 వేల ఉద్యోగ నియామక పత్రాలు
- తక్కువ సమయంలో డీఎస్సీ ఫలితాలు ఇచ్చామన్న ముఖ్యమంత్రి

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** దసరా లోపు కొత్త ఉపాధ్యాయ నియామక పత్రాలు అందిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సచివాలయంలో ఈరోజు ఆయన డీఎస్సీ ఫలితాలను విడుదల చేశారు. 11,062 పోస్టుల భర్తీకి జులై 18 నుంచి ఆగస్ట్ 5వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. ఫలితాలు విడుదల చేసిన తర్వాత సీఎం మాట్లాడుతూ... దసరా నాటికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేస్తామన్నారు. అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక ఉత్తర్వులు అందిస్తామన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లకు ఒకసారి మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిందని ముఖ్యమంత్రి విమర్శించారు. గత పదేళ్ల కాలంలో 7,857 పోస్టులను మాత్రమే భర్తీ చేసిందన్నారు. నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకు రావాలనే ఆలోచన గత ప్రభుత్వానికి లేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ నియామక ప్రక్రియను ప్రారంభించామన్నారు. తమ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యతను



ఇస్తోందన్నారు. తక్కువ సమయంలోని డీఎస్సీ ఫలితాలు ఇచ్చామని, పరీక్షల నిర్వహణ నుంచి నియామకాల వరకు... 65 రోజుల్లో 11 వేలకు పైగా పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పేదలకు కూడా విద్యను అందుబాటులోకి తీసుకురావాలనేది తమ ప్రభుత్వం ధ్యేయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లో 30 వేల మందికి ఉద్యోగ నియామక

# ముడా కుంభకోణంలో కర్ణాటక సీఎంపై ఈడీ కేసు

- మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక సీఎం
- సిద్ధరామయ్యతో పాటు ఆయన సతీమణి,బావమరిదిపై కేసు
- ముడా స్కాంపై సీఎంను విచారించాలని గవర్నర్‌కు ఫిర్యాదు
- సిద్ధరామయ్యపై విచారణ కర్నాటక గవర్నర్ ఆమోదం
- గవర్నర్ విచారణకు ఆదేశించడాన్ని సవాల్ చేసిన సిద్ధరామయ్య

2

**బెంగుళూరు-నవభూమి:** మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మీద ఈడీ కేసు నమోదు చేసింది. ఇప్పటికే దీనికి సబంధించి పోలీస్ కేసు నడుస్తోంది.

తాజాగా ఈడీ కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపింది. ఇప్పుడు ఈడీ సిద్ధరామయ్యతో పాటూ ఆయన భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామిలపై కూడా ఈడీ కేసు నమోదు అయింది. అంతకు ముందు కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు ముడా స్కామ్ కేసులో ఎదురుదెబ్బ తగిలింది. ముడా స్కామ్కు సంబంధించి సిద్ధరామయ్య, ఆయన భార్యతో పాటు ఇతరులపై కూడా విచారణ చేసేందుకు బెంగళూరు ప్రత్యేక కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ విచారణపై మూడు నెలల్లోగా నివేదిక



అందించాలని లోకయుక్త పోలీసులను ఆదేశించింది. మైసూరు అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటీ కుంభకోణం ప్రస్తుతం కర్ణాటకలో హాట్ టాపిక్గా మారింది. స్థలాల కేటాయింపులో సీఎం సిద్ధరామయ్య కుటంబ సభ్యులు లాభాలు పొందారని, అలాగే ముఖ్యమంత్రి అధికారాన్ని సైతం దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి.

# త్వరలో మంత్రి వర్గ విస్తరణ?

- ఆరుగురికి కొత్త మంత్రివర్గంలో ఛాన్స్
- సామాజిక వర్గాల వారీగా ఎంపిక
- ఆదిలాబాద్,నిజామాబాద్,నల్లగొండ, హైదరాబాద్,రంగారెడ్డి జిల్లాలకు ప్రాతినిధ్యం
- దానంతో రాజీనామా చేయించి గెలిచిన తర్వాతే మంత్రి పదవి దక్కే అవకాశం
- కశ్మీర్,ఢిల్లీ ఎన్నికల తర్వాతే విస్తరణ

2

## ఢిల్లీకి సీఎం

**హైదరాబాద్-నవభూమి** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి బయల్దేరారు. ఇటీవల జమ్ముకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం ఆయన పరామర్శించనున్నారు.

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నందున కేబినెట్లో ఖాళీగా ఉన్న ఆరు పోస్టులను భర్తీ చేయడంపై కసరత్తు ముమ్మరమైంది. దసరా పండగ నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని పార్టీ అధిష్టానం భావిస్తున్నది. ఇప్పటికీ ఏఐసీసీ, పీసీసీ మధ్య పలుమార్లు ఈ విషయంపై చర్చలు జరిగాయి. ఢిల్లీలోనూ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, పలువురు మంత్రులతో అగ్ర నేతలు చర్చించారు. ఈ భేటీల్లో కొంతమంది పేర్లు తెరపైకి వచ్చాయి. సుదీర్ఘ చర్చల తర్వాత ఏఐసీసీ పెదల ఆదేశాల మేరకు ఖరారు చేసి ప్రమాణ స్వీకారం చేయించే అవకాశాలున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. హర్యానా, కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు పూర్తికాగానే కేంద్ర, రాష్ట్ర పార్టీ నేతలు తుది దశ చర్చలు జరిపి కొలిక్కి తెచ్చే చాన్స్ ఉన్నది. ఉమ్మడి ఆదిలాబాద్. నిజామాబాద్, నల్లగొండ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందినవాడికి స్థానం దక్కవచ్చన్న ఊహాగా నాలు వినిపిస్తున్నాయి. కానీ ఏఐసీసీ, పీసీసీ నిర్ణయం తర్వాత క్లారిటీ మంత్రివర్గ విస్తరణలో ఇప్పటికే కొద్దిమంది పేర్లు ఏఐసీసీ, పీసీసీ పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (నల్లగొండ), గడ్డం వివేకానంద్" (ఆదిలాబాద్), గడ్డం వినోద్ (అదిలాబాద్), ప్రేమ్ సాగర్ రావు (ఆదిలాబాద్), బాలూ నాయక్ (నల్లగొండ), రామ చంద్రు నాయక్ (వరంగల్),మల్‌రెడ్డి రంగారెడ్డి (రంగారెడ్డి), సుదర్శన్‌రెడ్డి (నిజామాబాద్), దానం నాగేందర్. (హైదరాబాద్). వాడిటి శ్రీహరి. (మహబూబ్ నగర్) తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. ఒకవైపు జిల్లాలు. మరోవైపు సామాజిక సమీకరణాలు, ఇంకోవైపు కుటుంబ పరమైన సమాన అవకాశాలను పరిగణనలోకి తీసుకుంటున్న పార్టీ నాయకత్వం ఎలాంటి

# మరో మహమ్మారి?

- రువాండాలో ప్రబలుతున్న మరో ప్రాణాంతక వ్యాధి
- ఇప్పటికే ఈ వ్యాధి కారణంగా ఆరుగురి మృతి
- జ్వరంగా మొదలై ప్రాణాలను బలి తీసుకునే మార్బర్గ్ వైరస్
- జంతువులు,ప్రధానంగా గబ్బిలాల ద్వారా సోకే ఛాన్స్

2

**న్యూయార్క్-నవభూమి:** మార్బర్గ్ వైరస్... ప్రపంచానికి మరో మహమ్మారి పొంచి ఉందా? ఈ వ్యాధి రువాండాలో ఇప్పటికే ఆరుగురు ప్రాణాలను బలిగొంది. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని ఎలా వణికించిందనే సంగతి తెలిసిందే. ఈ సమయంలో మరో వైరస్ పేరు ఇప్పుడు తెరపైకి వచ్చింది. ఇప్పటికే ఈ వైరస్ కారణంగా ఆరు మరణాలు సంభవించినట్లు చెబుతున్నారు. ఈ సమయంలో ఆ వ్యాధి స్వభావం, లక్షణాలు, ఎలా వ్యాపిస్తుంది, నివారణా చర్యలు వంటివి తెలుసుకుందాం..! అవును... రువాండా ఇప్పుడు మార్బర్గ్ వైరస్ వ్యాధిని ఎదుర్కొంటోంది. ఇది హెమరేజిక్ జ్వరంతో కూడిన తీవ్రమైన అనారోగ్యం. ఈ వ్యాధి రువాండాలో ఇప్పటికే ఆరుగురు ప్రాణాలను బలిగొంది. ఈ సమయంలో



ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యమంత్రి పిలునిచ్చారు. భారతీయులకు స్వీట్ న్యూస్ మార్బర్గ్ వైరస్ వ్యాధి అనేది తీవ్రమైన అనారోగ్యానికి దారితీసి, అనంతరం మరణానికి కూడా దారితీసె వ్యాధి! జర్మనీలో 1967లో ఈ వైరస్‌ను మొట్టమొదటిసరిగా

# బీజేపీపై ఆశలు వదిలిన వైసీపీ!

- తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ముప్పేటా వైసీపీపై దాడి
- అవసరానికి ఉపయోగపడుతుందనుకున్న బీజేపీ వైసీపీకి మొండి చెయ్యి
- మోడీని టార్గెట్ చేస్తున్న వైసీపీ శ్రేణులు



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** సాధారణ ఎన్నికలలో చిత్తుచిత్తుగా ఓడిపోతే ఏమవుతుంది ... రాజ్యసభలో ఉన్న బలంతో బిజెపిని తమకు అనుకూలంగా మార్చుకుంటాం అని కలలు కన్న వైసిపి పప్పులు ఉడకటం లేదు.

రాజ్యసభ సభ్యులు ఒక్కొక్కరు వైసీపీని వీడి వెళుతున్నారు. ఇప్పటికే ఏకంగా ముగ్గురు ఎంపీలు బయటకు వచ్చేసారు. మోపిదేవి వెంకటరమణ - బీదా మస్తాన్‌రావు - ఆర్ . కృష్ణయ్య వైసీపీతో పాటు పదవులకు కూడా రాజీనామాలు చేసేశారు. పైగా కేంద్రంలో చంద్రబాబు కింగ్ మేకర్‌గా ఉండడంతో వైసీపీకి బిజెపితో దోస్తీ చేసే అవకాశం సందు కూడా దొరకటం లేదు. దీంతో వైసిపికి సీన్ అర్థమైపోయింది .. టిడిపి - జనసేనతో పాటు బిజెపిని కూడా శత్రుపార్టీల జాబితాలో చేర్చినట్టే కనిపిస్తోంది.

తాజాగా తిరుమల లడ్డు వివాదం పై వైఎస్ జగన్ తో పాటు వైసిపి నేతలపై హైదరాబాద్కు చెందిన బిజెపి మహిళ నేత మాధవి లత చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి పేర్ని నాని కౌంటర్ ఇచ్చారు. పక్క రాష్ట్రంలో ఉండేవారికి ఆంధ్ర రాజకీయాలు ఎందుకని ? ప్రశ్నించిన నాని హిందువులపై అమితమైన ప్రేమ ఒలక పోస్తున్న తాను ... తన ఆసుపత్రిలో హిందువులకు బిల్లులు తగ్గించారా అని నిలదీశారు. గతంలో అన్య మతస్తుడు అయిన ఏపీ గవర్నర్ ప్రధాని మోడీతో పాటు తిరుమల వెళ్లారని అప్పుడు బిజెపి నేతలు ఎందుకు ఆయనను ప్రశ్నించలేదని పేర్ని నాని నిలదీశారు. అన్యమతస్తుడు అని మతస్తుడిని డిక్లరేషన్ ఇవ్వకుండా తిరుమల ఎందుకు తీసుకువెళ్లారని మోడీని ఎందుకు ప్రశ్నించలేదు అన్నారు పేర్ని నాని.

తాజాగా పేర్ని నాని చేసిన వ్యాఖ్యలతో బీజేపీని వైసిపి నేరుగా టార్గెట్ చేసినట్టు క్లియర్గా అర్థం అవుతుంది. తిరుమల లడ్డు విషయంలో గత కొద్ది రోజులుగా బిజెపి నేతల ప్రాపకం కోసం తెగ ప్రయత్నించి విఫలం అయింది వైసిపి. ఇక ఆ పార్టీ నుంచి తమకు ఎలాంటి సహకారం దొరకదని ఫిక్స్ అయ్యారో ఏమోగానీ ఇప్పుడు ప్రధానిని కూడా ఈ విషయంలో ఇన్వాల్వ్ చేయడం చర్చనీయాంశం అవుతుంది. బిజెపిని ప్రశ్నించడం ద్వారా జాతీయ స్థాయిలో మరికొన్ని పార్టీల మద్దతు అయినా తమకు లభిస్తుందన్న ఆశలతో ఈ విషయంలో మోడీని సైతం వైసీపీ టార్గెట్ చేస్తున్నట్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# మిథున్ చక్రవర్తికి దాదాసాహెబ్ ఫాల్కే

- కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రకటన
- అక్టోబర్ 8న జరగనున్న 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల వేడుకలో పురస్కారం ప్రదానం
- 'ఎక్స్' వేదికగా మంత్రి అశ్విని వైష్ణవ్ స్పెషల్ పోస్ట్

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** భారతీయ సినిమాకు సంబంధించి అత్యున్నత పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఈసారి ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తిని వరించింది. ఈ ఏడాది ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఆయన ఎంపికైనట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది.



# ఎమ్మార్వో చెబితే చార్మినార్‌ను కూల్చేస్తారా?

- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని నిలదీసిన హైకోర్టు
- తెలంగాణ హైకోర్టులో హైడ్రాపై విచారణ
- వర్చువల్‌గా హాజరైన హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ హైకోర్టులో హైడ్రాపై సోమవారం విచారణ జరిగింది. ఈ విచారణకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వర్చువల్‌గా హాజరైరయ్యారు. తాము అడిగిన ప్రశ్నకు మాత్రమే సమాధానం చెప్పాలని.. హైడ్రా **మిగతా 2లో**



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 | హైదరాబాద్
మంగళవారం
01 । అక్టోబర్ । 2024

## మంత్రి కొండా సురేఖ కంటతడి.. కేటీఆర్‌కు తీవ్ర హెచ్చరిక



**హైదరాబాద్-నవభూమి:** మంత్రి కొండా సురేఖ కంటతడి పెట్టారు. తనపై ట్రోలింగ్ వ్యవహారంపై సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఆమె తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. పలుమార్లు కంటతడి పెట్టారు. తనపై ట్రోలింగ్ పట్ల మంత్రి భావోద్వేగానికి గురయ్యారు.కేటీఆర్ ఖబడ్దార్ .. ఖబడ్దార్ కేసీఆర్ అని ఆమె హెచ్చరించారు. ఈ ట్రోలింగ్ వీడియోలను మీ చెల్లికి, తల్లికి చూపించు కేటీఆర్ అని అన్నారు. ఇకపై ట్రోలింగ్ చేస్తే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. అన్ని పార్టీల వాళ్లు తనను అక్కా అని, తన భర్తను బావ అని పిలుస్తారని ఆమె చెప్పారు. ఇంకోసారి ఇలా చేస్తే కేటీఆర్ బట్టలు ఊడదీసి పరిగెత్తిస్తామని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. రఘునందన్ కాల్ చేసి క్షమించమని అడిగాడని, అక్కా క్షమించు కాళ్లు మొక్కుతా అని రఘునందన్ అన్నాడని ప్రస్తావించారు. సిగ్గు లజ్జ ఉంటే బట్టలు లేకుండా తిరుగాలంటూ రఘునందన్‌ను విమర్శించారు."ఏదో ఒకరోజు ప్రజలు తిరగబడతారు. చేనేత కార్మికుల ఓట్లతో గెలిచి పద్మశాలి బిడ్డను ఇంత అవమానపరుస్తారా?. మానసిక వేదన కలిగించి కుటుంబాల్లో ఇబ్బంది పెడుతారా?. నాకు మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తుందనే కేసీఆర్ మహిళకు మంత్రిపదవి ఇవ్వలేదు. రెండవరసారి అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్‌లో భారీ మార్పులు వచ్చాయి. బీఆర్ఎస్ నాయకులు డబ్బు మదం ఎక్కి పిచ్చిగా ప్రవర్తిస్తున్నారు" అని అన్నారు.



# హైడ్రా అంటే కూల్చివేతలే కాదు.. పేదల నివాసాల జోలికి వెళ్లదు.. స్పష్టం చేసిన ఏవీ రంగనాథ్



హైడ్రా అంటే కూల్చివేతలే కాదని కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. హైడ్రా పరిధి ఔటర్ రింగు రోడ్డు వరకే అని ఆయన తెలిపారు. నగరంలోనే కాదు.. రాష్ట్రంలో.. ఆఖరకు ఇతర రాష్ట్రాల్లో కూల్చివేతలను కూడా హైడ్రాకు ఆపాదించి సామాజిక మాధ్యమాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని అన్నారు.
హైడ్రా పేదల నివాసాల జోలికి వెళ్లదని ఏవీ రంగనాథ్ తెలిపారు. అలాగే నివాసం ఉంటే ఆ ఇళ్లను కూల్చదని చెప్పారు. కూల్చివేతలన్నీ హైడ్రావి కాదని స్పష్టం చేశారు. ప్రజలు, సామాజిక మాధ్యమాలు ఈ విషయాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వనరుల పరిరక్షణ, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటం, వర్షాలు, వరదల సమయంలో రహదారులు, నివాస ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు.మూసీ నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదని కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అక్కి నివాసితులను హైడ్రా తరలించడం లేదని చెప్పారు. అక్కడ ఎలాంటి కూల్చివేతలను హైడ్రా చేపట్టడం లేదని పేర్కొన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణ ప్రత్యేక ప్రాజెక్టు అని.. దాన్ని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని తెలిపారు.

## ఓఆర్ఆర్‌పై డివైడర్‌ను ఢీ కొట్టిన కారు, వైద్యుడు మృతి




**హైదరాబాద్-నవభూమి:** రాజేంద్రనగర్( వద్ద గల ఓఆర్ఆర్‌పై మరో ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమా దంలో వైద్యుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఓఆర్ఆర్‌పై వేగం గా వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో వాహనం కిందపడి పోయింది. ఈ ప్రమాదంలో ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖానలో నేత్ర వైద్యుడిగా పనిచేస్తున్న నిలయ రెడ్డి అక్కడిక్కడే మృతి చెందారు. సమా చారం అదుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సిట్ నుంచి సీబీఐకు?

**(1వపేజీ తరువాయి)**ఎంపీ సుబ్రమణ్యస్వామి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఇవాళ కీలక వ్యాఖ్యలు చేసింది.చంద్రబాబు ఈ వివాదంపై మీడియాకు ఎక్కడంతో పాటు నెయ్యి కల్తీ జరిగినట్లు సాక్ష్యాలు లేకపోవడం పైనా సీరియస్ అయింది. నెయ్యి శాంపిల్స్ పరీక్షలపై సెకండ్ ఒపీనియన్ తీసుకోకపో వడం, లడ్డూల్ని ముందే పరీక్షలకు పంపకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి విచారణ గురువారానికి వాయిదా వేసింది. అదే సమయంలో ఓ ట్విస్ట్ కూడా ఇచ్చింది.
లడ్డూ వివాదంలో సిట్ దర్యాప్తు కొనసాగింపుపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో దీనిపై సమీక్షకు సుప్రీంకోర్టు సిద్ధమైంది. ఈ మేరకు సిట్ దర్యాప్తు కొనసాగాలా లేక మరో దర్యాప్తు చేపట్టాలా అన్న అంశంపై సొలిసిటర్ జనరల్ అభిప్రాయం కోరింది. అక్టోబర్ 3న జరిగే విచారణలో సొలిసిటర్ జనరల్ తన అభిప్రాయం చెప్పనున్నారు. దాని ఆధారంగా సుప్రీంకోర్టు.. కీలక నిర్ణయం తీసుకోబోతోంది. అంటే కేంద్రం ఇచ్చే అభిప్రాయం ఆధారంగా సిట్ దర్యాప్తు లేదా సీబీఐ దర్యాప్తుపై సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోనుంది. దీంతో ఓవైపు సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో కంగుతిన్న చంద్రబాబుకు ఇది మరో సమస్యగా మారనుంది.

## ఆధారాలు లేవు : సుప్రీం వ్యాఖ్య

**(1వపేజీ తరువాయి)**కల్తీ జరిగిందని గుర్తించిన తర్వాత ఆ నెయ్యిని లడ్డూ తయారీలో వినియోగించారా? అలా వినియోగించినట్లు ఆధారాలు లేవు. విచారణ జరగకుండానే లడ్డూ కల్తీ జరిగిందని ప్రకటన చేయడం భక్తుల మనోభావాలు దెబ్బతీస్తోంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## కర్ణాటక సీఎంపై ఈడీ కేసు

**(1వపేజీ తరువాయి)**టి.జె అబ్రహం అనే సామాజిక కార్యకర్త ఈ వ్యవహారానికి సంబంధించి గవర్నర్కు ఫిర్యాదు చేశారు.
ఈ నేపథ్యంలో ముడా స్కాంపై వస్తున్న ఆరో పణల్లో సిద్ధరామయ్యపై విచారణ జరిపేందుకు కర్ణాటక గవర్నర్ ఆమోదం తెలిపారు. దీంతో సిద్ధరామయ్య హైకోర్టును ఆశ్రయించారు. గవర్నర్ తనపై విచారణకు పర్మిషన్ ఇవ్వడాన్ని సవాలు చేస్తూ కోర్టులో పిటిషన్ వేశాడు. అయితే దీనిపై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం ఆయన దాఖలు చేసిన పిటిషన్ను కొట్టివేసింది. ఈ క్రమంలోనే స్పెషల్ కోర్టు ముడా కుంభకోణంలో సిద్ధరామయ్య, తన భార్యతో పాటు ఇతరులపై విచారణ చేయాలని పోలీసులకు ఆదేశించింది.

## మరో మహమ్మారి?

**(1వపేజీ తరువాయి)**గుర్తించారు. ఇది సోకిన జంతువులతోను, ప్రధానంగా గబ్బిలాలతో మానవులకు వ్యాపిస్తుంది! ఈ వ్యాధి లక్షణాల విషయానికొస్తే... మార్బర్గ్ వైరస్ వ్యాధి సాధారణ లక్షణం అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, నీళ్ల విరేచనాలు, వాంతులు, కడుపు నొప్పి. ఈ వైరస్ సోకిన వ్యక్తుల రక్తం, స్రవాలు, ఇతర శరీర ద్రవాల ద్వారా ఇది ఇతరులకు వ్యాపిస్తుంది! అయితే ఈ వ్యాధికి ప్రస్తుతానికి నిర్దిష్టమైన చికిత్స అంటూ లేదు! %హాశ్రీంశీ =ముం% - పవన్ ప్రాయశ్చిత్త దీక్ష దేని కోసం ? ఈ మార్బర్గ్ వైరస్ వ్యాధి వ్యాప్తిని అరికట్టడానికి.. వ్యక్తులు మంచి పరిశుభ్రతను పాటించాలి. ఈ వ్యాధి సోకిన వ్యక్తులతో సంబంధాన్ని నివారించాలి. వీరిని చూసుకునేటప్పుడు తప్పనిసరిగా రక్షణ పరికరాలు ఉపయోగించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం... ఈ లక్షణాలు ప్రారంభమైనప్పటి నుంచి ఐదు - ఏడు రోజుల మధ్య తీవ్రమైన రక్తస్రావ వ్యక్తీకరణలు కనిపిస్తాయి. సాధారణంగా ఈ వైరస్ సోకిన ఎనిమిది నుంచి తొమ్మిది రోజుల తర్వాత కొంతమందికి మరణం సంభవిస్తుందని చెబుతున్నారు.

# హైడ్రా కూల్చివేతలకు బ్రేక్.. కారణాలివే..?



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులను కాపాడాలనే లక్ష్యంతో ఏర్పాటైన హైడ్రా.. రెండు నెలలుగా దూకుడుగా ముందుకు సాగుతోంది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో ఏ నిర్మాణాలు ఉన్నా వాటిని కూల్చివేస్తోంది. అలా ఇప్పటివరకు వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది. ఏ లక్ష్యంతో అయితే హైడ్రా ఏర్పాటైందో.. ఆ లక్ష్యంతో దూసుకెళ్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన డైరెక్షన్‌లో ముందుకు సాగుతోంది. అయితే.. హైడ్రా ఏర్పాటు నుంచి రెండు నెలల కాలంలో ఏనాడూ కూల్చివేతలకు బ్రేక్ ఇవ్వలేదు. కానీ.. ఇప్పుడు ఒక్కసారిగా హైడ్రా వెనక్కి తగ్గింది. గత రెండు రోజులుగా కూల్చివేతలకు బ్రేక్ వేసింది. దీనికి పలు కారణాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. హైడ్రా కూల్చివేతలతో చాలా మంది ప్రజలు రోదించడం చూశాం. ఇటీవల ఆ వీడియోలు సోషల్ మీడియాలోనూ బాగా వైరల్ అయ్యాయి. అటు ప్రతిపక్షాలు సైతం హైడ్రా కూల్చివేతలపై గగ్గోలు పెడుతున్నాయి. బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తుండడం చూస్తున్నాం. దాంతో వారి వ్యాఖ్యలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దాంతో హైడ్రాపై చాలా వరకు వ్యతిరేకత వచ్చింది. సోషల్ మీడియాలోనూ చాలా వరకు నెగెటివ్ కామెంట్స్ వచ్చి పడ్డాయి. మరోవైపు.. మూసీ ప్రక్షాళన పేరిట అక్కడి వారిని ఖాళీ చేయాలనే ప్రయత్నం నడుస్తోంది. దాంతో అక్కడి వారు తీవ్ర నిరసన తెలుపుతున్నారు. ఇప్పటికే పలువిధాలా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల బీఆర్ఎస్ ఆఫీసుకు కూడా చేరుకున్నారు. అక్కడి నుంచి బీఆర్ఎస్ మద్దతు కోరారు. ఇక ఇప్పుడు ఆ బాధితులకు ప్రతిపక్షాలు కూడా తోడయ్యాయి. ఈ క్రమంలో వారిని టచ్ చేస్తే వారి నుంచి మరిన్ని నిరసనలు ఎదుర్కోక తప్పదు. ఈ పరిణామాల మధ్య కూల్చివేతలకు కాస్త విరామం ఇవ్వాలని హైడ్రా నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తున్నది. అటు హైకోర్టు నుంచి కూడా బాధితులకు అనుకూలంగా పలు తీర్పులు వచ్చాయి. బాధితుల ఆక్రందనలు, నిరసనల నేపథ్యంలో ప్రభుత్వ విభాగాలు సైతం పునరాలోచనలో పడ్డాయి. మూసీ పరిధిలో ఇప్పటికే చాలా వరకు ఇళ్లకు మార్కింగ్ చేశారు. మరికొన్నింటికి చేయాల్సి ఉంది. కానీ.. ఇప్పుడు అధికారులు వాటి జోలికి పోవడం లేదు. కాస్త విరామం తీసుకొని ప్రజా ఫిర్యాదులపై సమగ్ర పరిశీలన చేసేందుకు సిద్ధమైనట్లుగా తెలుస్తోంది. ప్రత్యేకించి జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, స్థానిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అనుమతులు ఉన్న వాటిపై స్టడీ చేసి చర్యలు తీసుకోవాలనుకుంటున్నట్లు సమాచారం.

# జానీ మాస్టర్ బెయిల్ పిటీషన్ విచారణ వాయిదా!



**రంగారెడ్డి జిల్లా-నవభూమిబ్యూరో:** కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్‌పై విచారణను రంగారెడ్డి జిల్లా కోర్టు వచ్చే నెల అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేసింది. నిందితుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై నార్సింగి పోలీసులు... రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక పోక్సో కోర్టులో కౌంటర్ కూడా దాఖలు చేశారు. జానీ మాస్టర్‌కు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశముందని కౌంటర్‌లో పోలీసులు పేర్కొన్నారు. విచారణ సమయంలో బెయిల్ ఇవ్వవద్దని కోర్టును కోరారు. ఈరోజు విచారణ జరిపిన న్యాయస్థానం తదుపరి విచారణను వాయిదా వేసింది. అసిస్టెంట్ మహిళా కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో జానీ మాస్టర్‌ను నార్సింగి పోలీసులు అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించిన సంగతి తెలిసిందే. కోర్టు అనుమతితో నాలుగు రోజుల పాటు పోలీస్ కస్టడీకి తీసుకుని విచారించారు. ఇప్పటికే జానీ పోలీసులకు కీలక విషయాలు రాబట్టారు. ఇలాంటి సమయంలో బెయిల్ ఇవ్వవద్దని కోర్టును కోరినట్లు తెలుస్తోంది. అక్టోబర్ 4 వరకూ జానీ మాస్టర్ కి రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. మళ్లీ ఆ తేదీన జానీని కోర్టులో ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. జస్టిస్ హేమ కమిటీ నివేదిక మాలీవుడ్ ని కుదిపేసిన వేళ..దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన సమయంలో జానీ మాస్టర్ అత్యారారం ఆరోపణ వ్యవహారం సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. దీంతో టాలీవుడ్ లోనూ హేమ కమిటీ లాంటిది రావాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. దీనికి సంబంధించి శాశ్వత పరిష్కార కమిటీ వేయాలని పరిశ్రమ ప్రయత్నాలు చేస్తోంది.

# 9న టీచర్ పోస్టులు

**(1వపేజీ తరువాయి)**పత్రాలు అందించామని వెల్లడించారు. త్వరలో గ్రూప్ 1 పరీక్షల ఫలితాలను విడుదల చేస్తామ న్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించే లక్ష్యంలో భాగంగా మొదటి ఏడాదే 60,000 ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు.
11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ పరీక్ష నిర్వహించగా 2.45 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. దరఖాస్తుదారుల్లో 87.61 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారు. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు (6,508 పోస్టులు) గరిష్ఠంగా 88,000 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 2,629 మంది స్కూల్ అసిస్టెంట్లు, 727 మంది భాషా పండితులు, 182 మంది ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, 220 మంది స్కూల్ అసిస్టెంట్లు, 796 మంది సెకండరీ గ్రేడ్ టీచర్ నియామకాల కోసం పరీక్ష నిర్వహించారు.

**డీఎస్సీ.. 1:3 నిష్పత్తిలో వెరిఫికేషన్.. 9న నియామక పత్రాలు: సీఎం రేవంత్‌రెడ్డి**

కేవలం 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు విడుదల చేశామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో ఫలితాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు.
1:3 నిష్పత్తిలో వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు. అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందజేస్తామన్నారు. గత పదేళ్లలో భారాస ప్రభుత్వం ఒకే ఒక్క డీఎస్సీ ఇచ్చిందని.. కేవలం 7వేల పోస్టులతో ఒకే నోటిఫికేషన్ విడుదల చేసిందని విమర్శించారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని.. త్వరలోనే గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. పాఠశాల ఫీజుల నియంత్రణపై త్వరలో కమిటీ వేస్తామని సీఎం తెలిపారు.

**డీఎస్సీ అభ్యర్థులకు బిగ్ అలర్ట్, అక్టోబర్ 1 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్**

తెలంగాణ డీఎస్సీ ఫలితాలు విడుదలయ్యాయి. డీఎస్సీ అర్హత సాధించిన అభ్యర్థులకు అక్టోబర్ 1 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది.
ఈ నెల 5 వరకు ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేస్తారు. 1:3 నిష్పత్తిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయనున్నారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థులకు ఫోన్ లో సమాచారం అందిస్తారు. తుది జాబితాను డీఈవోలు ప్రకటిస్తారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల ఫొటో కాపీలతో వెరిఫికేషన్ హాజరవ్వాలని అధికారులు సూచించారు.

**డీఎస్సీ ఫలితాలు విడుదల**

తెలంగాణ డిఎస్సీ 2024 ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో విడుదల చేశారు. ఈ ఏడాది జులై 18 నుంచి ఆగస్టు 3వరకు డిఎస్సీ పరీక్షలను నిర్వహించారు. ఫలితాల విడుదలలో జాప్యం జరగడంపై అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఫలితాలను విడుదలయ్యాయి.
తెలంగాణ మెగా డిఎస్సీ 2024లో మొత్తం 11,062 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 2629 ఉన్నాయి. లాంగ్వేజ్ పండిట్ పోస్టులు 727, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 6508, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు 182, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టులు 220, సెకండరీ గ్రేడ్ స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టులు 796పోస్టులు ఉన్నాయి. 2017 తర్వాత తెలంగాణలో డిఎస్సీ నియామకాలను 2024లోనే నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 55 కేంద్రాల్లో డిఎస్సీ పరీక్షలను నిర్వహించారు.

**రికార్డు సమయంలో ఫలితాలు విడుదల**

తెలంగాణ డీఎస్సీ పరీక్షలకు మొత్తం 2,79,957 దరఖాస్తు చేసుకోగా.. 2,45,263 మంది పరీక్షకు హాజరయ్యారు. దాదాపు 34,694 మంది అభ్యర్థులు పరీక్షలు రాయలేదు. అత్యధికంగా సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులకు 92.10 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ నోటిఫికేషన్ లో భాగంగా మొత్తం 11,062 టీచర్ల పోస్టులను భర్తీ చేయనున్నారు. పోస్టుల వారీగా చూస్తే.. 2,629 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉండగా, 727 భాషా పండితులు, 182 పీఈటీలు, 6,508 ఎస్జీటీలు, స్పెషల్ ఎడ్యుకేషన్ 220 స్కూల్ అసిస్టెంట్లు, 796 ఎస్జీటీ ఉద్యోగాలు ఉన్నాయి.మరోవైపు డీఎస్సీ జనరల్ ర్యాకిం గ్ జాబితాలు విడుదల చేస్తే నియామక ప్రక్రియ ముందుకు వెళుతుంది. ఖాళీలను బట్టి 33 జిల్లాల్లో ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాల్సి ఉంటుంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తైన తర్వాత ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున జాబితాను జిల్లా సెలక్షన్ కమిటీలకు రాష్ట్ర విద్యాశాఖ నుంచి జాబితాలు వెళతాయి. ఈ మొత్తం ప్రక్రియకు మరో మూడు నెలల సమయం పడుతుందని భావిస్తున్నారు.

# 15 నుంచి ఉచిత ఇసుక

- పూర్తి స్థాయిలో అందుబాటులోకి .. అన్ని రీచ్‌లు ప్రారంభం: కొల్లు
- బందరు పట్టణంలోని పోతేపల్లిలో విలేకరులతో మాట్లాడిన కొల్లు
- పండుగ నాటికి నూతన మద్యం షాపులు అందుబాటులోకి
- బ్రాండెడ్ మద్యం పంపిణీకి రంగం సిద్ధం చేస్తామన్న కొల్లు



**మచిలీపట్నం-నవభూమిబ్యూరో:** రాష్ట్రంలో ఉచిత ఇసుకను అక్టోబరు 15 నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, అబ్కారీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అన్ని రీచ్‌లను ప్రారంభించడం వలన ట్రాన్స్‌పోర్టు తగ్గుతుందన్నారు. ఇసుకను సీనరీస్ నుంచి తమ సొంత వాహనాలతో తీసుకుని వెళ్లవచ్చన్నారు. పట్టా భూముల్లోంచి ఇసుక తీసుకువెళ్లేందుకు అవకాశం కల్పిస్తూ జీవో ఇస్తున్నామని తెలిపారు. సోమవారం కృష్ణా జిల్లా బందరు పట్టణంలోని పోతేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దసరా పండుగ నాటికి నూతన మద్యం షాపులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. బ్రాండెడ్ మద్యం పంపిణీకి రంగం సిద్ధం చేశామన్నారు. కనీస మద్యం ధర రూ.99గా నిర్ణయించామన్నారు. వైసీపీ పాలనలో ప్రభుత్వమే మద్యం షాపులు తెరిచి నాసిరకం మద్యం అమ్మి కోట్ల రూపాయలు దోచుకుందని విమర్శించారు.

# మృత్యుఘోష

**(1వపేజీ తరువాయి)**టన్నుల బాంబుతో దాడి చేసింది. నస్రల్లా తన కుమార్తెతో అక్కడ ఉన్నాడని తెలిసింది. బాంబు దాడి అనంతరం.. ఇజ్రాయెల్ సైన్యం తన సోషల్ మీడియా ఖాతాలలో "హసన్ నస్రల్లా ఇకపై ప్రపంచాన్ని భయపెట్టలేడు" అని పోస్ట్ చేసింది. నస్రల్లా మరణం తరువాత మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరిగాయి.
**అత్యవసర సమావేశానికి పిలుపు..**నస్రల్లా మృతితో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అత్యవసర సమావేశానికి పిలుపునిచ్చారు. దక్షిణ బీరుట్‌లోని హిజ్బుల్లా ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ దాడులు చేసిన తర్వాత ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఇరాన్ అధికారులు తెలిపారు. నస్రల్లాను అంతమొందించడంతో ఖమేనీని సురక్షిత ప్రదేశానికి తరలించారు.**తొలిసారి బీరుట్‌పై దాడి..**లెబనాన్ రాజధాని బీరుట్ నగరంలోని ఓ నివాస భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ నగరంలోని నివాస సముదాయాలపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్‌దాడులు చేయడం ఇదే తొలిసారి. కోలా ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్ భవనం పైఅంతస్తుపై ఐడీఎఫ్ బాంబులు ప్రయోగించింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు హెజ్‌బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేసిన ఇజ్రాయెల్.. ఇప్పుడు నివాస సముదాయాలపైనా విరుచుకుపడటంతో ప్రాణనష్టం మరింత పెరిగే అవకాశం ఉంది.

## త్వరలో మంత్రి వర్గ విస్తరణ?

**(1వపేజీ తరువాయి)**నిర్ణయం తీసుకుంటుందన్నది. ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ రాజీనామా చేయించి ఆ తర్వాత జరిగి ఉప ఎన్నికలో గెలిపించుకోవా అని స్టేట్ పార్టీ భావిస్తున్నది. ముస్లిం కోటా కింద మంత్రి పదవి విషయంలో మల్లగుల్లాలు పడుతోంది. కేబినెట్‌లో ముస్లింకు మంత్రి పదవి లేదు.

## మిథున్ చక్రవర్తికి

**(1వపేజీ తరువాయి)**అక్టోబర్ 8న జరగనున్న 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల వేడుకలో ఆయనను ఈ అవార్డుతో సత్కరించడం జరుగుతుందని పేర్కొంది.
ఈ మేరకు మంత్రి అశ్విని వైష్ణవ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఈ వార్తను పంచుకున్నారు. "మిథున్ అద్భుతమైన సినిమా ప్రయాణం తరతరాలకు స్ఫూర్తినిస్తుంది. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా దాదాసాహెబ్ ఫాల్కే ఎంపిక జ్యూరీ ఈ దిగ్గజ నటుడిని ఎంపిక చేసిందని ప్రకటించడం గౌరవంగా ఉంది" అని ట్వీట్ చేశారు. ఇక ఈ ఏడాది మిథున్‌ను ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ అవార్డు కూడా వరించిన విషయం తెలిసిందే. ఈ సీనియర్ నటుడు 1976లో మృణాల్ సేన్ దర్శకత్వం వహించిన 'మృగయా'తో తెరంగేట్రం చేశారు. ఈ చిత్రానికి గాను ఆయన ఉత్తమ నటుడిగా తన మొదటి జాతీయ చలనచిత్ర అవార్డును సైతం గెలుచుకున్నారు.
1980వ దశకంలో తిరుగులేని స్టార్‌డమ్ సొంతం చేసుకున్నారు. 1979లో వచ్చిన స్పై థ్రిల్లర్ 'సురక్షా' చిత్రం ద్వారా ఆయన స్టార్‌డమ్ బాగా పెరిగింది. ఆ తర్వాత 'డిస్కో డాన్సర్', 'డ్యాన్స్ డ్యాన్స్', 'ప్యార్ ఝుక్తా నహీ', 'కసమ్ పైదా కర్నే వాలేకి', 'కమాండో' వంటి సూపర్ హిట్స్ కొట్టారు మిథున్ చక్రవర్తి.

## ఎమ్మార్వో చెబితే చార్మినార్‌ను

**(1వపేజీ తరువాయి)**కమిషనర్‌కు హైకోర్టు స్పష్టం చేసింది. చార్మినార్‌ను కూల్చాలని అక్కడి ఎమ్మార్వో చెబితే కూల్చేస్తారా అంటూ హైడ్రా కమిషనర్‌ను ప్రశ్నించింది. అటు అమీన్ పూర్ తహశీల్దార్ పైనా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. భవనాన్ని 48 గంటల్లో ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చి 40 గంటల్లోపే ఎలా కూల్చుతారంటూ ధర్మాసనం సీరియస్ అయ్యింది.'మీ ఇష్టం వచ్చినట్లు కూల్చివేస్తారా ? అదివారం కూల్చకూడదన్న నిబంధన కూడా తెలియదా? కనీసం ప్రభుత్వ న్యాయవాదులను అడగాలన్న ఉద్దేశం కూడా లేదా? ప్రజలను భయభ్రాంతులకు గురి చేయాలి చూస్తున్నారా? అలా అయితే.. కోర్టులు చేతులు కట్టుకొని కూర్చోవు. స్టే ఇచ్చిన తర్వాత కూడా కూల్చివేత చేపడతారా?' అని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.'నోటీసులు జారీ చేసినప్పుడు వారి వాదన కూడా వినరా ? శనివారం సాయంత్రం ఇచ్చి.. ఆదివారం కూల్చివేతా? సెలవు దినం రోజున విధులకు హాజరై దూకుడుగా ఎందుకు కూల్చారు? రాజకీయ నాయకులు చెప్పింది వింటే మీరు ఇబ్బందులు పడతారు. చట్టం తెలుసుకోండి.. ఆ మేరకు ముందు వెళ్లండి' అని అధికారులకు హైకోర్టు సూచించింది.


# దర్శనం టిక్కట్లలో కోట్లాది రూపాయల అవినీతి

## టీడీపీ నేత వర్ల ఆరోపణ



**విజయవాడ, నవభూమి బ్యూరో :** వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల పుణ్యక్షేత్రంలో జరిగిన అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతోందని తెలుగుదేశం నాయకులు విరుచుకుపడు తున్నారు. తిరుమలలో ప్రతి అంశంలోనూ స్కాములు, దోపిడీలే జరిగాయని తెలుగుదేశం పొలిట్‌బ్యూర్ సభ్యుడు, సీనియర్ నాయకుడు వర్ల రామయ్య మండిపడ్డారు. విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో వర్ల రామయ్య మాట్లడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లూ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారె డ్డి, ఆర్కే రోజా ఆడింది ఆట, పాడింది పాటగా సాగిందని విమర్శించారు. కళాధర్ ట్రావెల్స్, బుక్ మై దర్శన్ సైట్‌ల ద్వారా రాష్ట్ర పర్యాటక శాఖ నుంచి పంపిణీ చేసే దర్శనం టిక్కట్ల మాయాజాలానికి తెర తీసారని ఆయన ఆరోపించారు. కళాధర్ ట్రావెల్స్, బుక్ మై దర్శన్ సైట్ ద్వారా ప్రతి రోజూ 70 లక్షల రూపాయల నుంచి కోటి రూపాయల వరకూ ఈ మంత్రులిద్దరూ దోచుకున్నారని వర్ల రామయ్య ఆరోపించారు. మంత్రులిద్దరు తమ ఏజెంట్ల ద్వారా భక్తుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశారని, దర్శనాల పేరుతో ప్రజల నుంచి ఇంత భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేయడం గతంలో ఎప్పుడూ జరగలేదని టీడీపీ సీనియర్ నాయకుడు వర్ల రామయ్య విమర్శించారు. దీనిపై పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ కు ఫిర్యాదు చేసామని, త్వరలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని వర్ల రామయ్య అన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ మంగళవారం 01 । అక్టోబర్ । 2024



## ఎన్నికల బాండ్ల కేసులో కేంద్ర మంత్రికి ఊరట.. స్టే ఇచ్చిన హైకోర్టు



**న్యూఢిల్లీ-నవభూమి:** కర్నాటక హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌పై నమోదు అయిన కేసులో విచారణను అడ్డుకుంటూ కోర్టు స్టే ఇచ్చింది. ఎన్నికల బాండ్లను కొనాలంటూ కంపెనీలపై మంత్రి సీతారామన్‌తో పాటు మరికొందరు వత్తిళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో ఇవాళ కర్నాటక హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. కేంద్ర మంత్రి సీతారామన్‌తో పాటు బీజేపీ నేతలపై నమోదు అయిన కేసును సీఐడీకి అప్పగించాలని బెంగుళూరు పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆ కేసులో స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ ఎం నాగప్రసన్న ఈ ఆదేశాలు జారీ చేశారు. జనాధికారా సంఘర్ష పరిషత్ (జేఎస్పీ) సంస్థ సహాధ్యక్షుడు ఆదర్శ ఆర్ అయ్యర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుగుతున్నది. ఐపీసీలోని 120బీ, 384 సెక్షన్ల ప్రకారం కుట్రపూరితంగా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపించారు. కానీ ఆ సెక్షన్ల కింద ఫిర్యాదుదారుడు నమోదు చేసిన కేసు చెల్లదని కోర్టు తెలిపింది.

## మహిళ తలలో సర్జికల్ సూది మరిచిన డాక్టర్.. తర్వాత ఏం జరిగిందంటే?



**లక్నో-నవభూమి:** ప్రభుత్వ ఆసుపత్రిలోని డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. తలకు గాయంతో వచ్చిన యువతికి కుట్లు వేశారు. అయితే సర్జికల్ సూదిని ఆమె తలలో మరిచిపోయి కట్టుకట్టారు. ఇంటికి తిరిగి వచ్చిన ఆ యువతి బాధతో అల్లాడిపోయింది. దీంతో ఆమెను ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా తలలో సూది ఉన్న విషయం బయటపడింది. ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పొరుగువారితో జరిగిన ఘర్షణలో 18 ఏళ్ల సితార తలకు గాయమైంది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. తల గాయాన్ని పరిశీలించిన డాక్టర్, అక్కడి సిబ్బంది సహాయంతో కుట్లు వేశాడు. ఆ తర్వాత తల గాయానికి కట్టుకట్టి ఆమెను ఇంటికి పంపించారు.

కాగా, ఇంటికి చేరుకున్న యువతి నొప్పితో అల్లాడిపోయింది. ఆమె అరిచి గోల చేయడంతో కుటుంబ సభ్యులు ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి డాక్టర్లు కట్టు విప్పి తల గాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తలకు వేసిన కుట్ల వద్ద సూది ఉన్నట్లు గమనించారు. దానిని తొలగించి ఆ గాయానికి కట్టువేశారు. దీంతో యువతికి ఆ బాధ నుంచి ఉపశమనం లభించింది.మరోవైపు తల గాయం వద్ద సూది మరిచిపోయి కట్టుకట్టిన ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ నిర్లక్ష్యంపై యువతి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న డాక్టర్ మద్యం సేవించి ఉన్నాడని ఆమె తల్లి ఆరోపించింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేసింది. దీంతో జిల్లా చీఫ్ మెడికల్ అధికారి స్పందించారు. కమిటీని ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు చేపడతామని చెప్పారు.

## బుల్డోజర్‌తో ఇళ్ల కూల్చివేతలపై సుప్రీంకోర్టు ఆగ్రహం.. అస్సాం ప్రభుత్వానికి ధిక్కార నోటీసు



**గువాహతి-నవభూమి:** బుల్డోజర్‌తో ఇళ్లను కూల్చివేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అస్సాం ప్రభుత్వానికి కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. బుల్డోజర్ చర్యలపై సుప్రీంకోర్టు సెప్టెంబర్ 17న ఉత్తర్వులు జారీ చేసింది. ముందస్తు న్యాయపరమైన అనుమతి లేకుండా కూల్చివేతలను దేశవ్యాప్తంగా నిషేధించింది. అయితే రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వే లైన్లు, నీటి వనరుల ఆక్రమణలకు సంబంధించిన కేసులకు మినహాయింపు ఇచ్చింది.

కాగా, అస్సాం కమ్రూప్ జిల్లా కచుటోలి పత్తర్ గ్రామం పరిధిలో గిరిజన భూమిని ఆక్రమించి నిర్మించిన 47 ఇళ్లను అధికారులు ఇటీవల కూల్చివేశారు. ఈ నేపథ్యంలో కోర్టు అనుమతి లేకుండా ఎలాంటి కూల్చివేతలు చేపట్టరాదన్న సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారని 47 మంది నివాసితులు ఆరోపిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ పిటిషన్లు పరిష్కరించే వరకు ఎలాంటి చర్యలు తీసుకోబోమని అస్సాం అడ్వకేట్ జనరల్ సెప్టెంబరు 20న గౌహతి హైకోర్టుకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అలాగే భూ యజమానులతో ఒప్పందాలు చేసుకుని దశాబ్దాలుగా తాము అక్కడ నివసిస్తున్నామని, చట్టపరమైన నిబంధనలను తాము ఉల్లంఘించలేదని పిటిషనర్లు వాదించారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు బీఆర్ గవాయి, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపింది. అస్సాం ప్రభుత్వానికి కోర్టు ధిక్కార నోటీసు జారీ చేసింది. మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆ రాష్ట్రాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని పేర్కొంది.

## ఘోర ప్రమాదం.. ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు.. నలుగురు దర్మరణం..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరప్రదేశ్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లోడుతో వెళ్తున్న ఓ ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. నోయిడాలోని 10-11 సెక్టార్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం. దాంతో హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటన జరిగిన తీరును గమనించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతులకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

### 'యా.. యా..' ఏంటి..?.. ఇది కాఫీ షాప్ కాదు.. కోర్టు రూమ్..

# న్యాయవాదిపై సీజేఐ ఆగ్రహం



**న్యూఢిల్లీ-నవభూమి:** సుప్రీంకోర్టులో ఇవాళ ఒక న్యాయవాది తీరు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు ఆగ్రహం తెప్పించింది. ఒక కేసు విచారణ సందర్భంగా సీజేఐ ఒక న్యాయవాదిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సదరు న్యాయవాది వాదనలు వినిపించే క్రమంలో పదేపదే 'యా.. యా..' అనడంపై సీజేఐ విస్మయం వ్యక్తం చేశారు. 'యా..' అనే పదం గౌరవప్రదమైన పదం కాదంటూ సీరియస్ అయ్యారు. 'మీరు కాఫీ షాప్‌లో లేరు.. కోర్టు రూంలో ఉన్నారు.. పదాలను జాగ్రత్తగా వాడండి.. 'యా..' అనే పదం అంటే నాకు, మా న్యాయమూర్తుల బెంచ్‌కు అలర్జీ. అలాంటి పదాలు వాడేందుకు మిమ్మల్ని మేం అనుమతించం' అంటూ సీజేఐ డీవై చంద్రచూడ్ లాయర్‌కు చీవాట్లు పెట్టారు. సదరు లాయర్ 2018లో సుప్రీంకోర్టులో దాఖలైన ఓ రివ్యూ పిటిషన్‌పై వాదనలు వినిపించడం మొదలుపెట్టారు.ఆ పిటిషన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 32తో ముడిపడినది. భారత పౌరుల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగినప్పుడు, వారికి రాజ్యాంగ పరిహారపు హక్కును కల్పించడమే ఆర్టికల్ 32 ప్రత్యేకత. ఈ పిటిషన్‌లో ప్రతివాదిగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌ను పేరును కూడా పిటిషనర్ చేర్చారు. దీనిపై సీజేఐ చంద్రచూడ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి స్థాయి వ్యక్తి పేరును పిటిషన్‌లో ఎలా చేర్చారని ప్రశ్నించారు.వెంటనే ఆ పేరును పిటిషన్ నుంచి తొలగించాలని కోర్టు రిజిస్ట్రీని సీజేఐ ఈ క్రమంలో మరోసారి లాయర్ స్పందిస్తూ.. గతంలో ఇదే పిటిషన్‌ను నాటి సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్ డిస్మిస్ చేశారని, తదుపరి సీజేఐ ఠాకూర్ ధర్మాసనం ఎదుట రివ్యూ పిటిషన్ వేశామని, దాన్ని కూడా డిస్మిస్ చేశారని, ఇప్పుడు వేసిన పిటిషన్‌లో అందుకే గొగోయ్‌ని కూడా ప్రతివాదిగా చేర్చామని చెప్పారు. దాంతో సీజేఐ ఈ పిటిషన్‌తో రంజన్ గొగోయ్‌కు సంబంధం లేదని, ఆయన పేరును తొలగించాలని ఆదేశించారు.

## హెచ్‌సీఎల్ ఆఫీస్ వాష్ రూమ్‌లో టెకీ మృతి... ఏం జరిగింది?



**నాగ్‌పూర్-నవభూమి:** ఇటీవల కార్పొరేట్ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు ఆఫీసుల్లో మృత్యువాతపడుతున్న ఘటనలు వైరల్ గా మారుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఎర్నెస్ట్ అండ్ యంగ్ సంస్థలో సీఏగా పనిచేసిన అన్నా సెబాస్టియన్ మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. పని ఒత్తిడితోనే ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. మరోపక్క గతవారం హెచ్.డీ.ఎఫ్.సీ. ఉద్యోగి సదాఫ్ ఫాతిమా అనే మహిళ బ్యాంక్ లోనే గుండెపోటుతో కుప్పకూలిపోయారు. ఇటీవల తమిళనాడులోనూ ఓ ఉద్యోగి పని ఒత్తిడి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కథనాలొచ్చాయి! ఈ క్రమంలో తాజాగా ప్రముఖ ఐటీ సంస్థ హెచ్.సీ.ఎల్. లో పనిచేస్తోన్న సాఫ్ట్ వేర్ ఇంజినీర్ మృతి వెలుగులోకి వచ్చింది.. తాజాగా ప్రముఖ ఐటీ సంస్థలో పనిచేస్తున్న టెకీ తన కార్యాలయం వాష్ రూమ్ లోనే గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ విషయం నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే... మహారాష్ట్రలోని నాగ్ పూర్ లో గల హెచ్.సీ.ఎల్. లో పనిచేస్తున్న 40 ఏళ్ల సీనియర్ అనలిస్ట్ నితిన్ ఎడ్విన్ మైఖేల్ శుక్రవారం రాత్రి 7 గంటలకు ఆఫీసులోని వాష్ రూమ్ కు వెళ్లాడు. అయితే... కాసేపటి తర్వాత కొలీగ్స్ వెళ్లి చూడగా కిందపడిపోయి ఉన్నాడు. దీంతో ఆందోళనకు గురైన వారు.. వెంటనే క్యాంపస్ క్లీనిక్ కి తీసుకెళ్లారు. విశేషాలేవి అక్కడ నుంచి నాగ్ పూర్ లోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్) కు తరలించారు. ఇదే సమయంలో పోలీసులకూ సమాచారం అందించారు. అయితే... ఆస్పత్రికి చేరుకునేసరికే నితిన్ ఎడ్విన్ మైఖేల్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై స్పందించిన పోలీసులు... గుండెపోటు కారణంగానే అతడు చనిపోయినట్లు ప్రాథమిక పరీక్షలో తేలిందని చెప్పారు. పని ఒత్తిడితో ఉద్యోగులు చనిపోతున్న ఘటనలు తెరపైకి వస్తోన్న వేళ నితిన్ మరణానికి కూడా అదే కారణమా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తామని అన్నారు. నితిన్ కు భార్య, ఆరేళ్ల కుమారుడు ఉన్నారు.

## తిరుమల లడ్డూ.. సిట్ దర్యాప్తులో తేలింది ఏంటి?



వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ తయారీలో జంతువుల నూనెలు, కొవ్వులు కలిశాయనే ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం లడ్డూ అంశంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది.

గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నేతృత్వంలో సిట్ విచారణను వేగవంతం చేసింది. ఇప్పటికే ఈ బృందం తిరుమలకు చేరుకుంది. తిరుమలలోనే ఉండి లడ్డూ తయారీని పరిశీలించనుంది. అలాగే మాజీ టీటీడీ మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, అప్పటి ఈవోలు, ఇప్పటి ఈవో శ్యామలరావు తదితరులను ప్రశ్నించనుంది

సిట్ తన దర్యాప్తులో భాగంగా మొదటి రోజు శ్రీవారిని దర్శించుకుంది. ఇక రెండో రోజు సెప్టెంబర్ 29న సిట్ బృందం సమావేశమైంది. ఎవరెవరు ఏయే పనులు చేయాలో బాధ్యతలు నిర్దేశించుకున్నారు. మరోవైపు కల్తీ నెయ్యి సరఫరాకు సూత్రధారులు, పాత్రధారులపై క్రిమినల్ కేసుల నమోదుకు సిద్ధమవుతున్నారు.

ఏఆర్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కల్తీ నెయ్యి సరఫరా చేసి, దేవస్థానాన్ని మోసం చేసిందంటూ టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ జీఎం మురళీకృష్ణ ఇటీవల తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆ మేరకు ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో సిట్ దర్యాప్తుకు దిగింది.సిట్ అధిపతి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, సభ్యులు.. విశాఖ రేంజీ డీఐజీ గోపీనాథ్ జెట్టీ, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజు టీటీడీ ఈవో శ్యామలరావును ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఏఆర్ డెయిరీకి టెండర్లు కట్టబెట్టిన వ్యవహారంపై ఆయన నుంచి వివరాలు సేకరించినట్టు సమాచారం.గత ప్రభుత్వ హయాంలో జరిగిన టెండర్ లో ప్రాథమికంగా ఎన్ని సంస్థలు పాల్గొన్నాయి? వాటిలో గరిష్ఠ, కనిష్ఠ ధరలపై సరఫరా చేసేందుకు టెండరు వేసిందెవరు? కాంట్రాక్టర్ ఎంపిక ఎలా జరిగింది? నెయ్యి సరఫరా తీరు ఎలా ఉంది? వంటి అంశాలపై ఈవో నుంచి సమాధానాలు రాబట్టినట్టు తెలుస్తోంది.ఈవోను కలిసిన అనంతం సిట్ అధికారులు ప్రొక్యూర్‌మెంట్ జీఎం మురళీకృష్ణను పిలిపించి వివరాలు సేకరించారని తెలుస్తోంది. ఎల్%-%1గా వచ్చిన సంస్థకు కాంట్రాక్టుని ఇచ్చే ముందు ఎల్%-%2 కూడా అదే ధరపై సరఫరాకు ముందుకొస్తే 65:35 ప్రాతిపదికన కట్టబెట్టే పద్ధతి ఉందా? అని ఆయనను ప్రశ్నించినట్టు సమాచారం.

ఏఆర్ డెయిరీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టును కట్టబెట్టడం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో సిట్ ఆరా తీస్తోంది. ఈ నేపథ్యంలో ఏఆర్ డెయిరీకి కూడా నోటీసులు ఇవ్వనుందని చెబుతున్నారు.


## వెర్రి వేలరకాలు.. పిచ్చి పలువిధాలు..

# సైన్ బోర్డుపై పుల్ అప్సులు!!




**అమేధి-నవభూమి:** సోషల్ మీడియాలో రీల్స్ కోసం కొంతమంది చేసే విచిత్ర వ్యవహారాలు చూస్తుంటే... వెర్రి వేల రకాలు.. పిచ్చి పలువిధాలు అని అనిపిస్తుంటుంది! రాత్రికి రాత్రి ఫేమస్ అయిపోవాలనో.. సోషల్ మీడియా సెలబ్రెటీగా పేరు సంపాదించాలనో కొంతమంది రీల్స్ పేరుమీద చిత్రవిచిత్రమైన పనులు చేస్తారనే సంగతి తెలిసిందే. ఈ విషయంలో కొంతమంది చేసే పనులు చికాకు తెప్పిస్తే, మరి కొంతమంది పనులు అసహ్యంగా అనిపిస్తుంటాయి. ఇక ఇంకొన్ని అయితే భయాందోళనలు కలిగిస్తుంటాయి. ఈ క్రమంలో తాజాగా ఓ వ్యక్తి రోడ్డుపై ఉండే సైన్ బోర్డు పైకి ఎక్కి పుల్ అప్స్ తీస్తూ వీడియో తీసుకున్నాడు. ఇప్పుడు అది వైరల్ గా మారింది.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అమేఠీ లోని నేషనల్ హై వేపై ఓ యువకుడు ప్రమాదకర స్టంట్లు చేశాడు! ఇందులో భాగంగా... రోడ్డుపై ఉండే సైన్ బోర్డుపైకి ఎక్కి పుల్ అప్స్ తీశాడు. నేల నుంచి సుమారు 10 మీటర్ల ఎత్తులో వేలాడుతూ ఈ పనికి పూనుకున్నాడు. ఈ సమాంలో మరో యువకుడు పైకి ఎక్కి వీడియో తీశాడు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. దీనిపై స్పందించిన నెటిజలు హెచ్చరికలతో కూడిన కామెంట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా... ప్రాణాలు చాలా విలువైనవని.. ఇలాంటి పనులు చేయడం ఏమాత్రం సరికాదని చెబుతున్నారు. రీల్స్ కోసం ఇలాంటి పనులు చెసేవారిపై చర్యలు తీసుకోవాలని మరొకరు స్పందించారు. మరోపక్క ఈ వ్యవహారంపై స్థానిక పోలీసులు స్పందించారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. ఇలాంటి పనులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మ్యాన్ ఈటర్ పాంథర్ వరుస దాడులు.. 11 రోజుల్లో ఏడుగురు మృతి



**ఉదయ్‌పూర్-నవభూమి:** రాజస్థాన్ ఉదయ్‌పూర్ లో మ్యాన్ ఈటర్ పాంథర్ వరుస దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. దీని దాడిలో ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోగా.. తాజాగా ఓ ఆలయ పూజారి ఈ పాంథర్ దాడిలో మృతి చెందాడు.వివరాల్లోకి వెళితే.. గోంగుడా గ్రామంలో గత కొంత కాలంగా మ్యాన్ ఈటర్ పాంథర్ వరుస దాడులకు (%ఖుఖత్‌ప్తవతీ-ౌఖుఎ్ఎ%) పాల్పడుతోంది. ఆదివారం రాత్రి కూడా ఓ ఆలయ పూజారిపై దాడి చేసింది. పూజారి మహరాజ్ విష్ణు గిరి ఆదివారం రాత్రి ఆలయంలో నిద్రిస్తున్న సమయంలో దాడి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిలో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. తాజా దాడితో గత 11 రోజుల్లో ఇది ఏడో మరణం అని వెల్లడించారు.మరోవైపు పాంథర్ వరుస దాడులతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన అటవీ శాఖ అధికారులు స్థానిక పోలీసుల సాయంతో ఆ ప్రాంతంలో ఉచ్చులు బిగించారు. మరోవైపు పాంథర్ వరుస దాడుల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా అనేక పాఠశాలలను అధికారులు మూసివేయాలని ఆదేశించారు. ప్రజలు సైతం సాయంత్రం వేళల్లో తమ ఇళ్లను వదిలి వెళ్లొద్దని, గుంపులుగా మాత్రమే బయటకు వెళ్లాలని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే.. తమ వెంట ఆయుధాలుగా కర్రలు లేదా ఇతర వస్తువులను తీసుకెళ్లాలని సూచించారు.ఇదిలా ఉండగా.. ఇప్పటి వరకూ జరిగిన అన్ని ఘటనల్లో ఒకే పాంథర్ దాడి చేసిందా లేక గుంపుగా ఉన్నాయా అన్నదానిపై స్పష్టత లేదు. అయితే, అన్ని సందర్భాల్లో జంతువు కదలికలు, దాడి స్వభావం ఒకే విధంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ మ్యాన్ ఈటర్ పాంథర్‌ను బంధించేందుకు అటవీ అధికారులు చర్యలు చేపట్టారు.

## అత్యంత ఖరీదైన వస్తువు ఇదే కానీ... భూమిపై లేదు!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ ప్రపంచంలో అత్యంత ఖరీదైన వస్తువు ఏదంటే చెప్పడం చాలా కష్టమనే అంటారు. ఇక మరికొంతమంది తత్వవేత్తలు, కవులు, ప్రేమికులను ఈ మాట అడిగితే.. అది ప్రేమ మాత్రమే అని సమాధానం చెబుతారు. అయితే మానవులు సృష్టించిన అత్యంత ఖరీదైన వస్తువు ఏది అంటే... ఇప్పుడు అత్యంత ఆసక్తికర సమాధానం తెరపైకి వచ్చింది. అవును... ఈ ప్రపంచంలో మానవ నిర్మిత అత్యంత ఖరీదైన వస్తువు ఏది అంటే.. ఉంది కానీ.. అది భూమిపై లేదు అనే సమాధానం వస్తుంది. అదే... అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐ.ఎస్.ఎస్.). మనిషి నిర్మించిన అత్యంత ఖరీదైన వస్తువుగా ఇప్పుడు దీన్నే చెబుతున్నారు. దీనికి సుమారు 100 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు అయ్యిందంట! గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ ప్రకారం... అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐ.ఎస్.ఎస్.) అత్యంత ఖరీదైన మానవ నిర్మిత వస్తువు. దీని చివరి ఖర్చు సుమారు 0 బిలియన్లు ఉంటుంది అని గిన్నీస్ వరల్డ్ రికార్డ్ తన అధికారిక వెబ్ సైట్ లో పేర్కొంది! దీని నిర్మాణంలో సుమారు 14 దేశాలు పాలుపంచుకున్నాయి. ఇది భూకక్ష్యలో వ్యోమగాములు ఉండేందుకు ఇది ఓ నివాస స్థలంగా ఉపకరిస్తోంది. కొన్ని అంచనాల ప్రకారం ఐ.ఎస్.ఎస్. నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చు సుమారు 12.55 లక్షల కోట్ల రూపాయల్ని చెబుతున్నారు. వాస్తవానికి దీని ప్రారంభ ఉద్దేశ్యం చంద్రుడు, అంగారక గ్రహం, గ్రహశకలాలకు భవిష్యత్తులో యంతరిక్ష యాత్రలకు స్టేజింగ్ గ్రౌండ్ గా పనిచేయడం. కానీ.. కాల క్రమేణా ఇది అంతరిక్ష పరిశోధనకు ఒక సోపాన రాయిగా కాకుండా మరింతగా పరిణామం చెందింది.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
మంగళవారం
01 । అక్టోబర్ । 2024



## ఆవు ఇకపై 'రాజ్యమాత'.. మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటన



**ముంబై–నవభూమి:** మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఆవును 'రాజ్యమాత'గా ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వేద కాలం నుంచి దేశీయ గోవుల ప్రాముఖ్యత, వాటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. భారతీయ సమాజంలో ఆధ్యాత్మిక, శాస్త్రీయ, చారిత్రికంగా ఆవు ప్రాముఖ్యతను ఇది తెలియజేస్తుందన్నారు. మానవ పోషణలో దేశవాళీ ఆవు పాల ప్రాముఖ్యత, ఆయుర్వేద, పంచగవ్య చికిత్సలు, సేంద్రియ వ్యవసాయంలో ఆవు ఎరువు ఉపయోగం వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని ఆవును 'రాజ్యమాత'గా ప్రకటించినట్లు పేర్కొన్నారు. మహారాష్ట్ర వ్యవసాయ, పాడిపరిశ్రమ అభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్యశాఖ ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని మంత్రివర్గం కూడా సోమవారం కీలక నిర్ణయం తీసుకున్నది. దేశీయ ఆవుల పెంపకం కోసం రోజుకు రూ.50 మంజూరు చేసే సబ్సిడీ పథకానికి ఆమోదం తెలిపింది.



## అడవి బిడ్డలకు అన్యాయం

భూమిని, ప్రకృతిని నమ్ముకొని ఆదివాసీ– గిరిజనులు జీవిస్తుంటారు. ప్రకృతిని ఆరాధిస్తూ, ప్రకృతి సంరక్షకులుగా కొండలు, కోనలనే నిలయాలుగా చేసుకొని బతుకుతుంటారు. మరికొందరు స్థిరంగా ఒకచోట నివసించకుండా దేశవ్యాప్తంగా సంచరిస్తూ మన దేశ నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు. దేశ రక్షణలో భాగస్వాములై తనువులు చాలించిన ఎందరో గిరిజన వీరులు చరిత్రపుటల్లో స్థానం దక్కక పునాది రాళ్లుగా మిగిలిపోయారు. మన దేశంలో చరిత్రకెక్కిన కొంతమంది ప్రజాస్వామ్యవాదుల కంటే ముందే జన్మించిన గిరిజన వీరులు, యోధులు, వారి ఆరాధ్య దైవాల చరిత్ర కండ్లముందే వేల సంవత్సరాలుగా కదలాడుతున్నది. అక్షరీకరణ కాకపోవడంతో అవి సమాజానికి చేరలేదు. సమ్మక్క– సారక్క, బంజారాల ఆరాధ్య దైవం సంత్ సద్గురు శ్రీశ్రీ సేవాలాల్ మహరాజ్, లక్కీ షా బంజారా, బిర్సాముండా, కొమ్రం భీం, తల్కం చందు (కేరళ) మొదలైన గిరిజన నాయకుల చరిత్రలతో పాటు భారతీయ ఇతిహాసాల్లో కనిపించే గిరిజనుల పాత్రలు అమోఘమైనవి. చెంచులు, కోయలు, గోండులు, ఎరుకలతో పాటు మహాభారతంలో గిరిజన యోధుడు ఏకలవ్యునిపై పరిశోధనలు జరగాల్సిన అవసరం, ఆవశ్యకత ఉన్నది.

ఆధునిక యుగంలోనూ ఆదిమ గిరిజనులు మాట్లాడే భాషకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లిపిని తీసుకురాలేకపోయాయి. అత్యధికులు మాట్లాడే గిరిజన భాషను ఎనిమిదో షెడ్యూల్లో చేర్చకపోవడంతో తరతరాలుగా వారి చరిత్ర, ఇతిహాసాలు వారికే పరిమితం అయిపోయాయి. దక్షిణ భారతదేశంలో కుంభమేళాను తలపించే సమ్మక్క– సారలమ్మ జాతర మౌఖిక సాహిత్యం, ప్రజల విశ్వాసం ఆధారంగానే జరుగుతున్నది. ఇప్పటి వరకు ఆ జాతర చారిత్రక వాంగ్మూలాలను వెతికే ప్రయత్నం జరగకపోవడం విచారకరం.

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసమే రాజ్యాంగ నిర్మాతలు రిజర్వేషన్లను తీసుకువచ్చారు. ఎవరి దయాదాక్షిణ్యాల మీదనో వాటిని రాజ్యాంగంలో చేర్చలేదు. విదేశీయులైనప్పటికీ మోర్లే మింటో–మాంటేగ్ చెమ్స్‌ఫర్డ్ అణచివేతకు గురైన వర్గాల వారిని గుర్తించారు. వారి సమగ్రాభివృద్ధికి రిజర్వేషన్లను అమలు చేశారు. అమెరికా లాంటి అగ్రరాజ్యాల్లోనూ రిజర్వేషన్ విధానం ఉన్నది. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత రాజ్యాంగ నిపుణులు పై వర్గాల వారిని ఎస్సీ, ఎస్టీలుగా గుర్తించి రిజర్వేషన్లు కల్పించారు. విద్యా, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ల విధానాన్ని ప్రవేశపెట్టారు.

12వ శతాబ్దం నుంచి దాగి ఉన్న గిరిజనుల ఇతిహాసం, కనుమరుగవుతున్న వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లు, కళారూపాలను కాపాడాలి. వారు మాట్లాడే భాషకు లిపి కనుక్కోవడం, వారి జీవన విధానంలో మార్పులు తదితర అనేక అంశాలను పరిశీలించి పరిశోధనాత్మక పత్రాలను రూపొందించాలి. గిరిజన విశ్వవిద్యాలయాల్లో ఆయా ప్రాంతీయ భాషల్లో పరిశోధనలు చేయడం ద్వారానే ఇది సాధ్యపడుతుంది.

గిరిజనుల జీవితాల్లో మార్పు రావాలంటే గిరిజనులు ఉన్నత విద్యనభ్యసించాలని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వారి కోసం ప్రత్యేకంగా కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాలను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా పార్లమెంటు ఉభయ సభల ఆమోదం లభించింది. ఫలితంగా 2007లో మధ్యప్రదేశ్‌లోని అమరకంటక్‌లో ఇందిరాగాంధీ జాతీయ గిరిజన విశ్వ విద్యాలయం ప్రారంభమైంది. 2008 జూలై నుంచి అది అందుబాటులోకి వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు 2019లోనే ఏపీలో కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయాన్ని ప్రారంభించింది. విజయనగరం జిల్లా కొండకరకంలో ఉన్న ఈ యూనివర్సిటీలో ప్రస్తుతం తరగతులు జరుగుతున్నాయి. ఎన్నో ప్రయత్నాల ఫలితంగా విభజన హామీ ప్రకారం.. తెలంగాణకు రావాల్సిన సమ్మక్క–సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం 2023 అక్టోబర్‌లో మంజూరైనది. ములుగు జిల్లాలో నెలకొల్పనున్న ఈ విశ్వ విద్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నది. ఒక ప్రత్యేక ఆశయంతో విద్యా సంస్థలు స్థాపించినప్పుడు సాధారణంగా ఆయా సామాజిక వర్గాల వారికి 70 శాతానికి పైగా అడ్మిషన్లు దక్కుతాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏకలవ్య పాఠశాలలు, రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన గురుకుల పాఠశాలల్లో ఆయా వర్గాల వారికి 70 శాతానికిపైగా రిజర్వేషన్ అమలవుతున్నది. కానీ, దురదృష్టకర విషయం ఏమంటే గిరిజనుల పేరుతో స్థాపించిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాలను యూజీసీ నిబంధనల ప్రకారం ప్రారంభించడం. దీనివల్ల గిరిజన విద్యార్థులకు 7.5 శాతం సీట్లే దక్కనున్నాయి. ఈ విశ్వవిద్యాలయాలను కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించాలి. అప్పుడే అనుకున్న ఆశయం నెరవేరుతుంది. తెలిసో, తెలియకో జరిగిన ఈ పొరపాటు వల్ల గిరిజన బిడ్డలు అన్యాయానికి గురవుతున్నారు. ఈ పొరపాటును కేంద్ర ప్రభుత్వం వెంటనే సరిదిద్ది గిరిజన విద్యార్థులకు 70 శాతం అడ్మిషన్లు కల్పించాలి. మిగిలిన సీట్లను ఇతరులతో భర్తీ చేసి అడవి బిడ్డలకు న్యాయం చేయాలి.

## పాఠశాల సుపరిపాలన - ముఖ్య రికార్డులు



విద్యా పరిపాలన అనేది నిర్దిష్ట లక్ష్యం వైపు దృష్టి సారిస్తూ మన ప్రయత్నాలను నిర్దేశించడానికి, తగు రీతూలో మార్గదర్శకం చేయడానికి వాటిని ఏకీకృతం చేయడానికి ఒక సమగ్ర ప్రయత్నం. విద్యాసంస్థ ప్రత్యేకమైన రీతుల్లో నిర్వహించబడాలి. విద్యాసంస్థను నిర్వహించడం అంటే అనేక విద్యాపర, విస్తృత కార్యక్రమాలను నిర్వహించడమే. దీనికై సేవా భావంతో, ముందుచూపు గల చురకైన నైపుణ్యాలు అవసరం.

స్కూల్ అడ్మినిస్ట్రేషన్:–

విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల వ్యవస్థకు అవసరమగు నియమాలు, నిబంధనలు, విధివిధానాలు తెలుపునది. పాఠశాల పరిపాలనలో ముఖ్యునితోపాటు, సంస్థలో పనిచేసే సకల యంత్రాంగం మమేకమవ్వాలి. ఆయా విద్యా పథకాలు, కార్యక్రమాలు మొదలగు ఆచరణలో పెడుతూ సమర్థవంతంగా సంస్థను నిర్వహించమే పాఠశాల పరిపాలన లక్ష్యం.

**స్కూల్ మేనేజ్మెంట్:–**

అందుబాటులోని వనరులను ఉపయోగిస్తూ, బోధన, విస్తరణ, పరిశోధన, తదితర విద్యాపనులను సమర్థవంతంగా, నిర్దేశించి నియంత్రించునది. సంస్థ సమర్థవంతమైన పనితీరు కై ఈ రెండు ముఖ్యమే.

పరిపాలన (అడ్మినిస్ట్రేషన్) ఆలోచనకు సంబంధించినదైతే– నిర్వహణ (మేనేజ్మెంట్) నిర్వర్తించుటకు (డూయింగ్) సంబంధించినది.

మెరుగైన ఫలితం పనితీరు కోసం రెండూ కలిసి నిర్వహించబడాలి.

సిద్ధాంతం, ఆచరణ రెండూ కలిసి సాగాలి:–

ప్లానింగ్, ఆర్గనైజింగ్, స్టాఫ్, డైరెక్షన్, కోఆర్డినేషన్, రిపోర్టింగ్, బడ్జెటింగ్, ముఖ్యమైన అంశాలు.

పాఠశాలలో నిర్వహించాల్సిన రికార్డులు / రిజిస్టర్

అకడమిక్:–

ఎఫ్ ఎల్ ఎన్ / లిప్ రికార్డ్
ఎఫ్ ఎ ఫలితాల రికార్డు
సెంట్రల్ మార్కుల రిజిస్టర్
సమయం – టేబుల్ 1. తరగతి వారీగా
2. ఉపాధ్యాయుల వారిగా
బాలసభజి
పి టి ఏ – (3వ శనివారం)
లైబ్రరీ, రీడింగ్ రిజిస్టర్
సైన్స్ సంబంధిత రిజిస్టర్
అకడమిక్ గైడ్ డెన్స్ రిజిస్టర్
అకడమిక్ క్యాలెండర్
వార్షిక ప్రణాళిక
లాగ్ బుక్
ప్రత్యామ్నాయ సమయ పట్టిక
కొత్త క్లిప్పింగ్ ఫైల్
10వ తరగతి ప్రత్యేక రిజిస్టర్
సంచిత రికార్డు పరీక్షకు సంబంధించినది
నామినల్ రోల్స్
పెన్ రిజిస్టర్ / ఫైల్
టీచింగ్ నోట్స్/ప్లాన్‌లు.

అడ్మినిస్ట్రేటివ్:–

హాజరు: 1.సిబ్బంది 2.విద్యార్థులు
అడ్మిషన్ రిజిస్టర్
సర్వీస్ రిజిస్టర్, ఇష్యూ రిజిస్టర్
వ్యక్తిగత ఫైల్‌లు
ప్రొసీడింగ్స్ రిజిస్టర్
సెలవుల కౌంట్ రిజిస్టర్
మూవ్మెంట్ రిజిస్టర్
సందర్శకుల రిజిస్టర్
స్టాఫ్ మీటింగ్ రిజిస్టర్
నోట్ బుక్ ఇష్యూ రిజిస్టర్ (వస్త్రాలు, యూనిఫాం మొదలైనవి...)
యం డి యం స్టాక్ రిజిస్టర్
యం డి యం రుచి రిజిస్టర్
యం డి యం హాజరు/బిల్లులు
ఇన్‌వర్డ్ / అవుట్‌వర్డ్ రిజిస్టర్
క్యాడర్ స్ట్రెంత్ రిజిస్టర్
వైద్య తనిఖీ రిజిస్టర్
తనిఖీ రిజిస్టర్

ఆర్థిక పరమైన:–

ఎస్ యం సి తీర్మానాలు
స్టాక్ ఎంట్రీలు రిజిస్టర్
క్యాష్ బుక్ సంబంధిత బిల్లులు / అక్విటెన్స్ రిజిస్టర్
టి బి ఆర్
ఫర్నిచర్ రిజిస్టర్
విరాళం రిజిస్టర్
ఆడియో విజువల్ సామగ్రి రిజిస్టర్
డైస్ ఫైల్
మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల ఫైల్
ఆదాయపు పన్ను ఫైల్ (రిటర్న్)
టి డి ఎస్ ఫైలింగ్ ఫైల్
డి డి ఒ నగదు పుస్తకం
అమ్మ ఆదర్శ పాఠశాల సంబంధిత రిజల్యూషన్లు / స్టాక్ ఎంట్రీ /నగదు పుస్తకం
అమ్మ ఆదర్శ పాఠశాల సంబంధిత రిజల్యూషన్ / స్టాక్ ఎంట్రీ /నగదు పుస్తకం

ఈ విధంగా సకల రికార్డులు సక్రమంగా ఎప్పటికప్పుడు నిర్వహించబడాలి. మాటలు, చేతలు, రాతలు ఈ మూడు ముఖ్యమైనవి. అయినా రాతల ద్వారా విషయాలు నిర్లిప్తమవుతూ గతానికి, ప్రస్తుతానికి, వర్తమానానికి విషయాలను విశ్లేషిస్తాయి. రాతపూర్వక విషయాలు తగు రీతుల్లో స్పష్టంగా వివరణ ఇస్తుంటాయి. మాటలకు, చేతలకు లింకు ఉంటేనే పనితనం బయటపడుతుంది. ఈ రెండు నిర్వహించబడిన విధానం రాతల్లో వెల్లడవుతుంది. ఈ రాతలే ముందు తరాలకు మార్గదర్శకంగా ఉంటాయి. రాతపూర్వక డాక్యుమెంట్లే నిజనిర్ధారణకై ఉపయోగపడుతుంటాయి. కావున రికార్డుల నిర్వహణ అవసరమైనది. వాస్తవాలను వెల్లడి చేస్తుంటాయి. క్లుప్తంగా థియరీ– ప్రాక్టీస్– రికార్డ్ గా చెప్పవచ్చు. అందుకే రికార్డులకు ప్రత్యేకత ఉంటుంది.




*డాక్టర్ ఎం ప్రభు దయాల్*
*మాజీ సెనేట్ మెంబర్ – కాకతీయ యూనివర్సిటీ జీవిత సభ్యుడు – ఐపిటిఈ కొత్తగూడెం*

## వృద్ధాప్యం శాపం కాదాదు



**అక్టోబర్ 1 అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం**

మనదేశంలో అరవై యేళ్లు దాటిన వారిని వృద్ధులుగా పరిగణిస్తారు. జీవితంలో సగభాగం కుటుంబం ఉన్నతి కోసం అహర్నిశలు శ్రమించి శరీరంలో జవసత్వాలు తగ్గి వయసు మీదపడడంతో ఇంకొకరిమీద ఆధారపడి జీవనం కొనసాగించే ఈ వృద్ధులు అనుభవంలో సమాజానికి విలువైన మానవ వనరులు. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని జీవిత సమస్యలను పరిష్కరించిన అనుభవాలను రంగదీసి ఇప్పటి సమాజంలో యువతరానికి వెలుగు చూపే దివ్వెలు వీరు. వీరి సేవలను తప్పనిసరిగా నేటి తరం ఉపయోగించుకోవాలి. వృద్ధులను అక్కున చేర్చుకోవాలేతప్ప పక్కకు నెట్టేయగూడదు.

**పెరుగుతున్న సీనియర్ సిటిజన్లు:**

మనదేశంలో వృద్ధుల జనాభా అపూర్వమైన స్థాయిలో విస్తరిస్తోంది. 01జూలై 2022 నాటికి 60 ఏళ్లు కంటే ఎక్కువ వయస్సు గలవారు 14.9 కోట్ల మంది ఉన్నారని, ఇది దేశ జనాభాలో 10.5% కి సమానమని ఇండియా ఏజింగ్ రిపోర్ట్ 2023 నివేదిక తెలిపింది. వీరిలో పురుషులకంటే, స్త్రీలు ఎక్కువ. మన తెలుగు రాష్ట్రాలు అత్యధిక మహిళా వృద్ధులు ఉన్న రాష్ట్రాలలో 5 వ స్థానంలో ఉన్నాయి. 1000 మంది పురుషులకు 1119 మహిళలు ఉన్నారు. వృద్ధులలో 40% కంటే ఎక్కువ మంది పేదరికంలో ఉన్నారని, 18.7% వృద్ధులకు ఎటువంటి ఆదాయం లేదని నివేదించింది. 71 శాతం ముదుసలి జనాభా గ్రామాలలోను మిగిలిన 29 శాతం మంది పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వృద్ధాప్య జనాభా దేశ వ్యాప్తంగా ఒకేలా లేదు. 2021లో హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలలో జాతీయ సగటు కంటే వృద్ధుల వాటా ఎక్కువగా ఉంది. వృద్ధులలో ఈ స్థాయి పేదరికం వారి జీవన నాణ్యత ఆరోగ్య సంరక్షణపై ప్రభావితం చేస్తుందని నివేదిక పేర్కొంది. వృద్ధాప్య సూచిక ప్రకారం 2021 జనాభా అంచనాల ప్రకారం భారతదేశంలో 100 మంది పిల్లలకు 39 మంది వృద్ధులు ఉన్నారు. మధ్య, ఈశాన్య రాష్ట్రాలతో పోల్చినప్పుడు దక్షిణ, పశ్చిమ భారత రాష్ట్రాలు అధిక వృద్ధాప్యాన్ని కలిగి ఉన్నాయి.




**వృద్ధులు ఎదుర్కుంటున్న సమస్యలు :**

శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, సామాజికంగా అనేక రకాల ఇబ్బందులు వృద్ధులకు ఎదురవుతాయి. ఇదివరకే ఉన్న దీర్ఘకాలికరోగాలతో పాటుగా వృద్ధాప్య సమస్యలైన శారీరక బలహీనత, జ్ఞాపకశక్తి తగ్గడం, అజీర్ణం, దృష్టి, దంత సమస్యలు, నరాలకు సంబంధించిన వ్యాధులు తోడవుతాయి. కొంతమంది భార్య లేదా భర్త మరణంతో ఏకాకి అవుతారు. ఒంటరితనం, అభద్రతా భావం , మరణభయం వంటి మానసిక సమస్యలు కూడా వేధిస్తాయి. ఆర్థికంగా సంపాదించలేరు. ఆదాయ వనరులు తగ్గుతాయి. వీటి కారణాల వలన కొన్ని కుటుంబాలలో వీరు నిర్లక్ష్యానికి, వేధింపులకు గురవుతారు. సమయాభావం వలన కుటుంబ సభ్యులు వీరితో ఎక్కువ సమయం గడపలేరు. కొంత మంది వారసులు వీరి అనుమతి లేకుండానే ఆస్తి లేదా ఇతర ఆర్థిక పరమైన వనరులను అమ్మడం లేదా దుర్వినియోగం చేస్తారు. ఈ విధంగా ఆర్థికదోపిడీకి గురయ్యే అవకాశం ఉంది. వీరి ఆరోగ్యం దృష్ట్యా సరిపడినంత ఆహారాన్ని అందుబాటులో ఉంచరు. వీరి ఆరోగ్యంపై పిల్లలు పెద్దగా దృష్టి పెట్టరు. సరిపడినన్ని మందులు కొనివ్వరు. మూత్ర విసర్జన చేస్తే వస్త్రాలు మార్చకుండా అలానే ఉంచుతారు. పరిశుభ్రమైన గదులు కేటాయించరు. వీరి మాటలను ఎవరూ పట్టించుకోరు. వారికి కావలిసినవి కొనివ్వరు. అపరిశుభ్రత కారణాన్న దుర్భాషలకు లోనవుతారు. కొన్ని కొన్ని కుటుంబాలలో వృద్ధులు భౌతిక దాడికి కూడా గురవుతున్నారు.

వీటికి కారణాలు :

కొన్ని కుటుంబాలలో యువత వారి వృత్తిపరమైన అవకాశాల కోసం భారమైన హృదయాలతో తమ తల్లిదండ్రులను ఇంటి వద్దనే విడిచిపెట్టవలసిన పరిస్థితులు వస్తున్నాయి. పేదరికం వలన గ్రామీణ ప్రాంతాలలో తల్లిదండ్రులను విడిచిపెట్టి జీవనోపాధి కోసం వలస పోతారు. తగినంత ఆర్థిక పరిపుష్టి లేక వృద్ధుల కోరికలను తీర్చలేకపోతున్నారు. ఇంట్లో వారందరూ ఎవరి పనికి వారు వెళ్ళడం వలన వృధ్ధులపై దృష్టి పెట్టలేకపోతున్నారు. వృద్ధులు సంపాదించస్థాయిలో లేనందున వారివలన ఉపయోగంలేదనే ఒక రకమైన నీచస్వభావం వృద్ధులపై నిరాదరణకు మరో ప్రధాన కారణం. ఆర్థికంగా ఉన్నవారు కూడా ఉద్యోగరీత్యా జన్మనిచ్చిన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో ఉంచుతున్నారు.


ప్రభుత్వాల సహాయం:

మన దేశ రాజ్యాంగంలో ఆర్టికల్ 21, ఆర్టికల్ 38(1), 39 (ఇ), ఆర్టికల్ 41, ఆర్టికల్ 46 లు వృద్ధులకు అండగా ఉంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం 2017లో తల్లిదండ్రుల, సీనియర్ సిటిజన్ నిర్వహణా సంక్షేమ చట్టాన్ని సవరించింది. ఈ చట్టం తల్లిదండ్రుల బాధ్యత వారి వారసులు లేదా దత్తపుత్రులదే అని చెబుతుంది. సీనియర్ సిటిజన్లు ఆరోగ్యకరమైన, సంతోషకరమైన, గౌరవప్రదమైన స్వావలంబన కోసం అటల్ వయో అభ్యుదయ్ యోజన పథకం ఉంది. దేశవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో 650కి పైగా వృద్ధుల గృహాలను కేంద్రప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇవి నిరుపేద వృద్ధులకు నివాసం, ఆహారం, వైద్య సంరక్షణ, వినోదం వంటి ప్రాథమిక సౌకర్యాలను అందించడం ద్వారా వారి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి కృషి చేస్తున్నాయి. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' పథకం ద్వారా 75 సంవత్సరాల స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం 75 కొత్త సీనియర్ సిటిజన్ గృహాలను ప్రారంభించింది. ప్రభుత్వం సీనియర్ సిటిజన్ల కోసం జాతీయ ఎల్డర్‌లైన్ పేరుతో 14567 ఫోన్ నంబరును హెల్ప్‌లైన్‌గా ప్రారంభించింది. సీనియర్ ఏబుల్ సిటిజన్స్ ఫర్ రీ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ డిగ్నిటీ పోర్టలును 1 అక్టోబర్ 2021న దేశ వ్యాప్తంగా ప్రారంభించబడింది. ఇంకా కేంద్రం ఆరోగ్య భీమా పథకాలు అమలు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వృద్ధాప్య పింఛనులు ఇస్తున్నాయి. ఇవన్నీ ఒకెత్తయితే సామాజికంగా పిల్లల ఆలోచనాదృష్టి మారాలి. తల్లిదండ్రుల బాధ్యత పిల్లలు తీసుకోవాలి. వృద్ధుల పట్ల నిరాదరణ తగ్గించేందుకు, ఆదరణ పెంచేందుకు, వారి సమస్యల పరిష్కారాలపై తీసుకోవాల్సిన పనులపై, కుటుంబ సభ్యుల నుంచి ఎదుర్కొనే వేధింపుల నివారణకు యువత నడుమబిగించాలి.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**

భక్తి

## ఆచరణాత్మకతే ప్రమాణం



మాతా అమృతానందమయి

సముద్రపు లోతును ఒక చేప ఎప్పటికీ కొలవలేదు. అదే విధంగా అనంతుడైన భగవంతుణ్ణి పరిమితమైన మేధస్సుతో మనం ఎన్నటికీ కొలవలేం. కాబట్టి మనకు ఉన్న పరిమితులలోనే దైవాన్ని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించాలి. మన అందరి లోపలా దైవికమైన స్పృహ ఉంటుంది. దానిని మనం గుర్తించం. ఎందుకంటే... అంతరంగంకన్నా మనకు శరీరం ప్రధానం. శరీరం ద్వారానే ఇతరులను గుర్తిస్తాం, మనల్ని గుర్తించాలని కోరుకుంటాం. అందంగా కనిపించాలనుకుంటాం. దానికోసం ఎన్నో సౌందర్య సాధనాలను ఉపయోగిస్తాం. మన శరీరం నుంచి చెమట వాసన రాకుండా ఉండడానికి అత్తరులు పూసుకుంటాం. కానీ అంతర్గత శుద్ధి కోసం మనం ఏం చేస్తున్నాం? ఈ స్పృహ మనలో కలగాలంటే... జ్ఞానాన్ని పొందడం అవసరం. అది పొందినప్పుడు... జీవితం ఒక మహా గ్రంథం అవుతుంది. ఇతరులు దాని నుంచి మంచి విషయాలు నేర్చుకోగలుగుతారు.

గొప్ప గ్రంథాలు చదివితే గొప్ప జ్ఞానం వస్తుందని మనం అనుకుంటాం. అది సత్యమే కానీ... మన చుట్టూ ఉన్నవాళ్ళను పరిశీలిస్తే అంతకన్నా గొప్ప విషయాలు తెలుస్తాయి. గ్రంథాలలోని విశేషాలను ఆశ్రమాల్లో బోధిస్తూ ఉంటారు. అక్కడికి వెళ్ళిన ప్రతి ఒక్కరూ వాటి గురించి తెలుసుకుంటారు. కానీ ఏ గ్రంథం సారాంశమైనా క్రియారూపంలోకి వచ్చినప్పుడే రాణిస్తుంది. ఆచరణాత్మకతే దేనికైనా ప్రమాణం. మనం చదివిన, విన్న గ్రంథాల సారాన్ని ఇతరులతో మనం వ్యవహరించేటప్పుడు ఆచరణలోకి తీసుకురావాలి. ఆ బోధలను జీవితంలో అనుసరించినప్పుడే వాటికి సార్థకత.

%జీవితంలో మనకు ఎదురయ్యే ప్రతి సందర్భం ఆ భగవంతుడు మనకు పెడుతున్న పరీక్ష అనే అవగాహనను మనలో అభివృద్ధి చేసుకోవాలి. మనం నేర్చుకున్నవాటిని బాగా గుర్తుంచుకోవాలి. మనకు ఎదురయ్యే పరీక్షలో నెగ్గడానికి సాధనాలుగా వాటిని ఉపయోగించుకోవాలి. ఇతరులతో వ్యవహరిస్తున్నప్పుడు ప్రశాంతంగా, సహనంతో, సామరస్యంతో ఉండగలుగుతున్నామా? యాంత్రికంగా ప్రవర్తిస్తున్నామా? గ్రంథాల్లో చదివిన మంచి విషయాలను ఇతరుల ముందు వల్లె వెయ్యడానికి మాత్రమే పరిమితం చేస్తున్నామా? అలాంటప్పుడు మనకూ, టేప్ రికార్డర్‌కూ మధ్య తేడా ఏముటుంది?

మంచి విషయాలను ఆచరించి ఎదుటివారికి చూపించాలి. వారిలో ప్రేరణ కలిగించాలి. 'తేనె' అనే పదాన్ని కాగితం మీద రాసి, దాన్ని నాకినంతమాత్రాన... తేనె తియ్యదనాన్ని రుచి చూడగలమా? ప్రతి ఒక్కరి ముందూ 'మేము మంచి వాళ్ళం' అని చెప్పుకోగలమేమో... కానీ మన మంచితనం రుచి మన ప్రవర్తన ద్వారానే వాళ్ళకు కనిపిస్తుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 | హైదరాబాద్ మంగళవారం 01 ၊ అక్టోబర్ ၊ 2024



# నవతార

## వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు ఫుల్



శరీరం వ్యాధుల బారిన పడకుండా కాపాడేవి యాంటీ ఆక్సిడెంట్లే. ఇవి పండ్లు, నట్స్ వంటి వాటిలో పుష్కలంగా లభిస్తాయి. వీటిని రోజూ తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని అంటున్నారు పోషకాహార నిపుణులు.

**బెర్రీలు:** బ్లూబెర్రీ, రాస్ప్‌బెర్రీ, బ్లాక్‌బెర్రీలలో ప్రొయాంథోసియానిడిన్స్ అనే యాంటీఆక్సిడెంట్లు ఉంటుంది. ఇది గుండెజబ్బులు, క్యాన్సర్ రాకుండా కాపాడుతుంది. ఉదయాన్నే స్మూతీగా తీసుకోవచ్చు. యోగర్ట్ లేక తృణధాన్యాలతో కలిపి తీసుకోవచ్చు.

**గ్రేప్స్ :** వీటిలో సి విటమిన్‌తో పాటు మెగ్నీషియం లభిస్తుంది. సాధారణ కెరోటినాయిడ్‌గా పిలిచే బీటా కెరోటిన్ నుంచి రెస్‌వర్ట్రాల్ వరకు బోలెడు యాంటీ ఆక్సిడెంట్లు వీటిలో లభిస్తాయి.

**వాల్‌నట్స్ :** యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభించే వాల్‌నట్స్ పది, పదిహేను తీసుకుంటే చాలు. వంద గ్రాముల వాల్‌నట్స్‌లో 15.2 గ్రాముల ప్రొటీన్, 65.2గ్రాముల ఫ్యాట్, 6.7గ్రాముల ఫైబర్ ఉంటుంది. అంతేకాకుండా ముఖ్యమైన ఎమైనో యాసిడ్స్ లభిస్తాయి.

**గ్రీన్‌టీ :** ఇందులో కెటచిన్ ఫాలిఫెనాల్స్ అనే మిశ్రమం ఉంటుంది. ఇది శరీరంలో ఇతర రసాయనాలతో కలిసి పని చేసి థర్మోజెనెసిస్ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. క్యాన్సర్, గుండెజబ్బులు దరిచేరకుండా చూస్తుంది. అధిక కొలెస్ట్రాల్ సమస్యకు పరిష్కారం చూపుతుంది.

# ‘ఫేమస్ ఫోక్ సింగర్’గా కనకవ్వ



రేషన్‌కార్డు బియ్యం తెచ్చుకునే కాడ వేలిముద్ర వేసుడు తప్ప అక్షరం తెలువని ఆమె ఇప్పుడు ‘ఫేమస్ ఫోక్ సింగర్’గా దృశ్యమాధ్యమాలకు ఎక్కింది. సమ్మక్క – సారలమ్మ పాట అయినా... సంక్రాంతి గీతమైనా... ఇప్పుడు ఆమెనే పాడాలే... హిట్టు కావాలే. నిన్నటిదాక నెత్తిమీద పండ్ల గంప ఎత్తుకొని మారుబేరం చేసుకునే గొట్టె కనకవ్వ (63) ఇప్పుడు కాల్ షీట్లు ఇచ్చే స్థాయికి ఎదిగింది. ‘మైకు ముందర పాడితే నా పాటకే స్టూడియోళ్లు మ్యూజిక్కులు కొడుతంద్రు, పాటైనంక చప్పట్లు కొడుతున్నరు...’ అంటున్న ఈ పల్లె కోయిలమ్మ ముచ్చటించింది. ఆ ముచ్చట్లు ఆమె మాటల్లోనే...

“చిన్ననాడు నేడు చిక్కుడు పెడితే... చిక్కుడు పెడితే...
గోరుచిక్కుడై గోలలెత్తి కాసు... గోరు చిక్కుడై...
వయసు నాడు నేను ఆనిగంబు(సొరకాయ) పెడితే... ఆనిగంబు పెడితే...
ఆనిగంబు తీగంతా అల్లిబిల్లాయే...
ఆడోళ్ల కనతల్లి నీళ్లాకు ఎలితే... ఆడోళ్ల కనతల్లి
అమాస చీకటి ఆబాయి మీద... అమాస చీకాటీ...
మొగోళ్ల కనతల్లి నీళ్లాకు ఎలితే... మొగోళ్ల కనతల్లి
కోరెవెన్నెల కాసు... కోనేరు మీదా... కోరెవెన్నెల కాసు...”

మా అవ్వ నోట ఇన్న పాట ఇది... ఇప్పుడు పాడుతుంటే అందరికీ నచ్చుతోంది.

అవ్వే పాటల తోవ సూపింది...

మాది సిద్ధిపేట జిల్లా అక్కన్నపేట మండలం బొడిగెపల్లె. ఇప్పుడు పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఇందిరానగర్‌లో నివాసముంటున్నం. ఐదుగురు అక్కాచెల్లెళ్లు, ముగ్గురు అన్నదమ్ములున్న ఉమ్మడి కుటుంబంలో పుట్టిన. అందరం గోదావరిఖనిలోనే స్థిరపడ్డం. నాతోటి చెల్లెళ్లు ప్రమీల, స్వరూప సింగరేణి నర్సరీలో పని చేస్తరు. మా అవ్వ పేరు జంగంపల్లి రాజవ్వ. వ్యవసాయం చేస్తూ వ్యవసాయ కూలీగా బతికేది. ఆ ప్రాంతానికి కరువు వస్తే కప్పతల్లి ఆటకంటే ముందు మా అవ్వతో పాట పాడించేవారట. మా అవ్వ రాజవ్వ ఐదు రోజుల పాటు ఆగకుండా పాట పాడేదట. ఆమె పాట పాడితే వాన తప్పకుండా పడేదట. ఆ పాట వారసత్వం నాకు అబ్బింది. 40ఏళ్ల క్రితం గోదావరిఖనికి వచ్చినప్పుడు వరంగల్, హైదరాబాద్‌ల్లో కూడా నేను, నా పెనిమిటి (భర్త) కలిసి కూలీనాలి చేసుకున్నం. ఊళ్లె వ్యవసాయ కూలీలుగా పని చేస్తాం. పట్టణాల్లో హమాలీ పని, రైతు మార్కెట్‌లలో చేసినం. గోదావరిఖని వచ్చిన తరువాత ఏ కాలం పండ్లు వస్తే ఆ కాలంలో అమ్ముకున్నాం. పంటలు సరిగ్గా లేక పెద్ద కొడుకు, పని దొరకక చిన్న కొడుకు ఇప్పటికీ తిప్పల పడుతుంద్రు. కష్టం వచ్చినా, ఆకలి అయినా, దూప అయినా మాకు పాటే దిక్కు.

**మనవరాలు పంపిన పాటతో...**

నాలుగు నెలల క్రితం ఏదో టీవీల ఫోక్ సింగర్స్ ఉంటే ఒక్క నిమిషం పాట పాడి సెల్‌ఫోన్‌లో పంపుమని చెప్పంగా మా మనుమరాలు ఇన్నది. నిద్రలకెల్లి లేపి మా ముగ్గురు అక్కాచెల్లెళ్లతోని పాడిచ్చి పంపింది. ఆ టీవీ వోళ్లు ఫోన్ చేసి కనకవ్వది ఒక పాట రికార్డు చేసి మళ్లీ పంపమని చెప్పింద్రు. నేను పాడి పంపిన. హైదరాబాద్‌కు రమ్మన్నరు. ఆడికి పోయినంక అదో ప్రపంచం. అన్నీ నేర్సినోళ్లు అక్కడ ఉన్నరు. భయమైంది. కానీ నా పాట ఇన్నంక చప్పట్లు కొట్టింద్రు. కొన్నిచోట్ల ఎట్ల పాడాల్నో వాళ్లు చెప్పిండ్లు. వాళ్ల పాటలు నాకు నేర్పిండ్రు. ఒకటి రెండుసార్లు ఇనంగానే నేను





పాడిన. వాళ్లకు నచ్చింది. ఇగ అక్కడి నుంచి నాకు రికాం లేదు. టీవీలోళ్లు, పేపర్లోళ్లు, పాటలోళ్లు... ఇలా అందరూ నా చుట్టే తిరుగుతంద్రు. ఒక సినిమాల పాడమని అడుగుతంద్రు. ఇప్పుడు ఒక్కటేదమ్ము షూటింగ్‌లు, రికార్డింగులు, సెల్ఫీలు దిగుడు అంతా గమ్మత్ అయితంది. నన్ను చూసి ‘సింగర్ కనకవ్వవు కదా’ అంటంద్రు. సెలబ్రెటినంటంద్రు...

అన్ని పాటలు పాడుతా...

రెండుమూడేళ్లుగా మా అక్కాచెల్లెళ్ల పాటలు, మా అమ్మ చెప్పిన పాటలు జనాల్లోకి పోవాలని ఆలోచిస్తన్నం. అమ్మపాట, పల్లెపాట రికార్డు కావాలన్నది మా తపన. కోలాటం, బతుకమ్మ, ఉయ్యాలపాట, బాగోతం పాటలు, బోనాల పాటలు, ఇది గది అని కాదు... అన్నీ పాడుతం. పొలంలో ఉంటే తప్ప పాట రాదు. కానీ లోకం తీరును బట్టి ఈ మధ్య అన్నీ రకాల పాటలు నేర్చుకుంటున్నం. సినిమా పాటలు కూడా ఇంటికాడ పాడుతం. పొలం నెర్రెవారితే కండ్లళ్ల నీళు తిరిగి పాట అదే తన్నుకచ్చేది. నా పాట ప్రజలు ఇనాలే, నన్ను మెచ్చుకోవాలే. సచ్చేదాక పాడుతా... ఏ పాట నేర్పినా ఆ పాట పాడుతా...

మా అమ్మపాడే పాటలళ్ల ఆడపిల్లల కష్టాలు, కన్నీళ్లు ఉండేవి. మాకు చిన్నప్పుడు తెలువకపోవు, కానీ ఆడోళ్లు కష్టాలళ్ల కుంగిపోవద్దు, వంగిపోవద్దు. ఇంట్ల బాధలనే ఆమె పాటలు పాడుకునేది. పాట రాసింది తెలువదు, కైగట్టింది ఎవరో తెలువదు, రాగం అల్లింది ఎవరో తెలువదు. అమ్మపాడితే నేనూ పాడేదాన్ని. చిన్నప్పుడు గౌరెల్లి, గోవర్ధనగిరి, హుస్నాబాద్‌లళ్ల బాగోతం ఆడుదురు. కచ్చరాలు కట్టుకుని పోదుము. ఇంటికి వచ్చే సరికి తెల్లారేది. రాత్రి ఇన్నయి తెల్లారి పాడేది అమ్మ. కాలం గాకపోతే మా అమ్మతో పాటపాడిస్తే వాన పడేదట. తొమ్మిది రోజులు బతుకమ్మ పాటలు పాడుకునేవాళ్లం. ఇప్పుడంటే డీజేలు వచ్చినయి.

నన్ను చిన్నప్పుడు బళ్లె వేస్తే చింతల కింద ఆటలాడేదాన్ని. ఆవుల కావలి పోయేదాన్ని. అచ్చరం నేర్వలేదు. పదేళ్లకే పెళ్లి అయ్యింది, మేనరికం, 16 ఏళ్లకే పెద్దబిడ్డ పుట్టింది. చిన్నప్పుడు పెళ్లి కావడంతో పెనిమిటి నేను దోస్తుల లెక్క తిరిగేటోళ్లం. మునుపటి కాలమే మంచిగుండే. అవ్వఅయ్యా చెప్పినోళ్లనే చేసుకున్నం. ఇప్పుడు ఆడోళ్లను చంపుతంద్రు, గొంతులు పిసుకుతుంద్రు. ఆడోళ్లు గుండె ధైర్యంగా ఉండాలే. మన దారిలో మనం నడవాలే.”

# అల్లం... అమృతం



తడిగా ఉన్న అల్లపు దుంపని ఆర్ద్రకం అంటారు. దీనినే శృంగవేరి అనికూడా పిలుస్తారు. ఎండిన అల్లానికి శొంఠి అని పిలుస్తారు. ఎండిన అల్లానికి కొమ్ములు ఉంటాయి కాబట్టి– దీనిని తెలుగులో శొంఠికొమ్ము అనటమూ ఉంది. కర్ణాటకలోని శృంగేరీ ప్రాంతంలో అల్లం బాగా పండుతుంది కాబట్టి ఆ ప్రాంతాన్ని ’శృంగవేరగిరి‘ అన్నారు. శంకరాచార్యుల వారు తన పీఠాన్ని ఇక్కడే ప్రతిష్ఠించారు. అదే శృంగేరిగా ప్రసిద్ధి చెందిందని చెప్తారు.

లాభాలెన్నో...

అల్లానికి ఆయుర్వేదంలో ఒక ప్రత్యేకమైన స్థానముంది. స్థూలకాయం, వాపులు, అజీర్తి, మలబద్ధతలను తగ్గించటానికి దీనిని వాడతారు. గడ్డలు, ట్యూమర్లు ఏర్పడకుండా, రక్తం గడ్డకుండా రక్తప్రసారం మెరుగుపరచటంలో అల్లం కీలకమైన పాత్ర పోషిస్తుంది. అంతే కాదు.. మనం తినే పోషకాలు వంటబట్టడానికి.. వ్యాధినిరోధకశక్తి పెరగటానికి కూడా ఇవి ఉపకరిస్తాయి. ఇక అల్లాన్ని ఇతర పదార్థాలతో కలిపి తింటే ఆరోగ్యం మెరుగుపడుతుంది.

అల్లం తురుమును బెల్లం పాకం పట్టి ఉండలుగా చేసి చప్పరిస్తే– శ్వాసకోశ వ్యాధులు తగ్గుతాయి. ఊపిరి తీసుకొనే పద్ధతిలో మార్పు వస్తుంది. నాలుకపై ఏర్పడే పలుచని జిగురు పొర తొలగిపోయి రుచి తెలుస్తుంది. గొంతు శ్రావ్యత కూడా పెరుగుతుంది.

అల్లాన్ని పాలల్లో వేసి బాగా పొంగనిచ్చి.. ఉదయాన్నే తాగితే టీబీలాంటి జబ్బులు రావు.

అల్లం రసం, నిమ్మరసం కలిపి దానిలో తగినంత ఉప్పు వేసి తాళింపు పెట్టుకోవాలి. ఇలా తయారయిన పలుచటి చట్నీని అన్నంతో కలుపుకొని క్రమం తప్పకుండా తింటే కడుపులో ఉండే నుసి పురుగులు పోతాయి. జీర్ణశక్తి మెరుగుపడుతుంది.

ఎలా తినాలి?

అల్లాన్ని ఎలా తినాలనే విషయాన్ని క్షేమశర్మ– తన క్షేమకుతూహలంలో పేర్కొన్నాడు. క్షేమశర్మ చెప్పిన సూత్రం ప్రకారం– అల్లాన్ని– “భోజనాగ్రే సదాపథ్యం”లో తినాలి. అంటే భోజనంలో మొదటి ముద్దగా తినాలి. అంతే కాదు. వంకాయ, కంద వంటి కూరలు ఆరగటం కష్టమవుతుంది. అందువల్ల వాటిలో అల్లాన్ని తప్పనిసరిగా కలపాలి. తేలికగా అరిగే బీర, పొట్ల, సొర, పాలకూర, తోటకూర వంటి వాటిలో అల్లాన్ని కలపాల్సిన అవసరం లేదు.

ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలి. అల్లానికి వేడి చేసే స్వభావం ఉంది. అందువల్ల వేడి శరీర తత్వం ఉన్నవారు అల్లాన్ని పరిమితంగా తీసుకోవాలి. శరీరానికి వేడి కలిగించే వెల్లుల్లితో అసలు కలపకూడదు. అల్లం, వెల్లుల్లి – ఈ రెండు ఔషధాలు కూడా! వీటిని మితంగానే వాడాలి. అతిగా వాడితే ప్రతికూల ఫలితాలు ఏర్పడతాయి.

# అందం.. అప్రమత్తంగా...



**మనం పాటించే చిన్నపాటి నియమాలు, జాగ్రత్తలు మేకప్ ప్రభావాన్ని ఇనుమడింపజేస్తాయి. కాబట్టి మేకప్ వేసుకోవడం మొదలుపెట్టిన తొలినాళ్లలో సాధారణంగా దొర్లే వీలున్న పొరపాట్ల పట్ల అప్రమత్తంగా నడుచుకోవాలి. అవేంటంటే...**

అన్నీ అవసరం లేదు: కాస్మటిక్స్ షాప్‌లోకి అడుగు పెట్టగానే అంతులేనన్ని ఉత్పత్తులు కళ్లను కట్టిపడేస్తాయి. ఏం కొనాలో అర్థం కాని పరిస్థితిలో, అమోమయానికి లోనై అవసరం లేని అప్లికేటర్స్ అన్నిటినీ కొనేయడం సరి కాదు. నిజానికి ఐల్యాష్ కర్లర్, భిన్నమైన మేకప్ స్పాంజ్‌లను కొనవలసిన అవసరం లేదు. అలాగే పలు రకాల బ్లష్‌లూ, లిప్‌స్టిక్‌లూ కొనవలసిన అవసరం ఉండదు. ప్రారంభంలో బేసిక్ మేకప్ కిట్ కొనుక్కుంటే సరిపోతుంది. ఆ తర్వాత అవసరాన్ని బట్టి ఒక్కొక్క ప్రొడక్ట్ జోడించుకుంటూ వెళ్లాలి. మస్కారా, లిప్‌స్టిక్, ఐబ్రో పెన్సిల్, ఫౌండేషన్‌లతో మేకప్ మొదలుపెట్టుకోవాలి. ఈ ఉత్పత్తులుండే మేకప్ కిట్‌ను ఎంచుకోవాలి.


శుభ్రమైన ముఖానికే మేకప్: సాధారణంగా చాలా మంది మేక్‌పకు ముఖం ఎలా ఉన్నా ఫరవాలేదనుకుంటారు. మేకప్ చాటున అన్నిటినీ దాచేయవచ్చనుకుంటారు. కానీ మేక్‌పకు ముఖాన్ని సిద్ధం చేసుకోవాలంటే, ముందుగా ముఖాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. గంటల తరబడి ముఖం మీద ఉండిపోయిన మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ మీద మేకప్ అప్లై చేసుకోవడం సరి కాదు. ఈ నియమం లిప్‌స్టిక్‌కు మాత్రమే మినహాయింపు. లిప్‌స్టిక్ లేదా గ్లాస్‌ను తేలికగా రీఅప్లై చేసుకోవచ్చు. అయితే కాస్త ఖాళీ సమయం దొరికినా న్యాప్కిన్‌ను నీళ్లలో ముంచి, పెదవుల మీది లిప్‌స్టిక్ పూర్తిగా తొలగించి తిరిగి అప్లై చేసుకుంటే, మరింత ఆకర్షణీయంగా కనిపిస్తాం.

మురికి బ్రష్‌లతో తంటా: మురికి మేకప్ బ్రష్షులతో చర్మ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఇందుకోసం వారాంతాల్లోని తీరిక సమయాలను కేటాయించాలి. గోరువెచ్చని నీళ్లను గిన్నెలో నింపి, ఒక టీస్పూన్ షాంపూ కలిపి, బ్రష్ కుంచెలన్నీ మునిగేలా పది నిమిషాలు నానబెట్టి, వేళ్లతో సున్నితంగా రుద్ది శుభ్రం చేసి, తాజా నీళ్లలో కడగాలి. తర్వాత బ్రష్‌లను టవల్ మీద ఆరబెట్టి, దాచుకోవాలి. మేకప్ బ్రష్‌లు అదనంగా కొని పెట్టుకుంటే, అత్యవసరమైన సమయాల్లో అక్కరకొస్తాయి. పైగా ఖరీదైన బ్రష్‌లనే ఎంచుకోవాలనే నియమమేమీ లేదు. నాణ్యత విషయంలో రాజీ పడినా మేక్‌పలో అంతగా మార్పులుండవు.

కనుబొమలు ప్రధానమే: చాలా మంది ముఖంలోని అన్ని అంశాలకూ ప్రాధాన్యం ఇచ్చి, కనుబొమలను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. అలాగని వాటిని అవసరానికి మించి దిద్దుకున్నా, ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. కాబట్టి తీర్చిదిద్దిన కనుబొమల కోసం, మ్యాట్ ఐషాడోతో కనుబొమలు దిద్దుకోవాలి. కనుబొమల రంగుకు దగ్గరగా లేదా అంతకంటే లేత రంగులో ఉండే ఐబ్రో పెన్సిల్‌నే ఉపయోగించాలి.

మేక్‌పతో నిద్ర: ఇది సరి కాదు. ఎంత అలసటతో పక్క మీద వాలిపోయినా, మేకప్ తొలగించడం మర్చిపోకూడదు. లేదంటే చర్మ రంధ్రాలు పూడుకుపోయి, ఇన్‌ఫెక్షన్లు తలెత్తుతాయి. తర్వాతి రోజు ముఖం తాజాగా వెలిగిపోవాలంటే ముందు రోజు వేసుకున్న మేకప్ పూర్తిగా తొలగించి, చర్మానికి గాలి సోకేలా చూసుకోవాలి. మేకప్ తొలగించడానికి క్లీన్సింగ్ మిల్క్ లేదా స్వచ్ఛమైన కొబ్బరినూనె ఉపయోగించవచ్చు. మేకప్ తొలగించి, సబ్బుతో ముఖాన్ని శుభ్రం చేసుకున్న తర్వాత, తప్పనిసరిగా నాణ్యమైన మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి.

# పొట్ట తగ్గాలా.. గుడ్డు తినండి!



వ్యాయామం చేయకపోవడం, జీవనశైలిలో మార్పుల నేపథ్యంలో బరువుతోపాటు పొట్ట కూడా పెరుగుతుంది. అలాంటప్పుడు కొవ్వు పదార్థాలు తగ్గించడం మాత్రమే కాదు.. కొన్ని పదార్థాలను రోజూ తీసుకోవాలి. వాటిలోని పోషకాలు పొట్ట చుట్టూ కొవ్వు పేరుకోకుండా చూస్తాయి.

బాదం: మోనోశాచురేటెడ్ ఫ్యాట్లు శరీరంలో కొవ్వును కరిగించే శక్తిని పెంచుతాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. శరీరంలో నీరు కూడా పేరుకోకుండా ఉంటుంది. ఆ పోషకాలు అందాలంటే బాదంతోపాటు ఇతర నట్స్ తినాలి.

ఓట్స్: ఉదయం పూట నూనెతో చేసిన అల్పాహారాలకు బదులు ఓట్స్‌కి ప్రాధాన్యం ఇవ్వాలి. జీవక్రియల రేటు వృద్ధి అవుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. తక్షణ శక్తి అంది ఎక్కువ సమయం ఆకలి వేయదు. దీనిలోని పీచు కూడా జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. ఓట్స్ తీసుకునేటప్పుడు అందులో చక్కెరకు బదులు ఏవైనా తాజా పండ్ల ముక్కలూ, రసాలు కలిపితే సహజ చక్కెర్లు అందుతాయి. పొట్ట వస్తుందనే భయం కూడా ఉండదు.

గుడ్డు: మాంసకృత్తులు అధికంగా అందించే గుడ్డు పొట్ట చుట్టూ ఉండే కొవ్వుని కరిగించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా తెల్లసొన తీసుకోవడం వల్ల బి12, డి విటమిన్లు, ఒమెగా– 3 ఫ్యాటీ ఆమ్లాలు శరీరానికి అధికంగా అందుతాయి. ఇవి బరువు తగ్గడంలో కీలక పాత్రపోషిస్తాయి. దీనివల్ల ఎముక సాంద్రత పెరుగుతుంది. గుండె పని తీరు కూడా మెరుగవుతుంది.

పండ్లు: ఆకలిగా అనిపించినప్పుడు ఏ మిఠాయిలో, ఇతర చిరుతిళ్లో తినే బదులు.. పండ్లు ఎంచుకోవడం మంచిది. వీటి వల్ల చక్కెర్లు, కొవ్వూ అందుతాయన్న బాధ ఉండదు. పోషకాలూ ఎక్కువగా అందుతాయి. బరువూ తగ్గుతారు.

## లాభాల స్వీకరణకు ఇన్వెస్టర్లు.. భారీ నష్టాలతో ఈక్విటీ మార్కెట్లు..!



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. అన్ని సెక్టార్ల పరిధిలో ఇన్వెస్టర్లు భారీగా లాభాల స్వీకరణకు దిగడంతో ఇటు బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్, అటు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ ఒకశాతానికి పైగా నష్టపోయాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 1272.07 పాయింట్ల (1.40 శాతం) నష్టంతో 84,299.78 పాయింట్ల వద్ద ముగిసింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 368.10 పాయింట్ల (1.41 శాతం) పతనంతో 25,810.85 పాయింట్ల వద్ద స్థిర పడింది. నిఫ్టీ-50లో 41 స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. హీరో మోటో కార్ప్, రిలయన్స్, యాక్సిస్ బ్యాంక్, భారత్ ఎలక్ట్రానిక్స్ తదితర స్టాక్స్ 4.03 శాతం నష్టపోయాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎన్టీపీసీ, బ్రిటానియా ఇండస్ట్రీస్, హిందాల్కో ఇండస్ట్రీస్, టాటా స్టీల్ తదితర తొమ్మిది స్టాక్స్ లాభాలతో స్థిర పడ్డాయి. అలాగే బీఎస్ఈ-30లో 25 స్టాక్స్ నష్టాలతో స్థిర పడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా స్టాక్స్ 3.15 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు జేఎస్ డబ్ల్యూ స్టీల్, ఎన్టీపీసీ, టాటా స్టీల్, టైటాన్ కంపెనీ, ఏషియన్ పెయింట్స్ మాత్రమే లాభ పడ్డాయి.




## బ్లాక్ టికెట్ల వ్యవహారం.. బుక్ మై షో సీఈవోకు మరోసారి సమన్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** బుక్ మై షో సీఈవో, సహ వ్యవస్థాపకుడు అశీష్ హేమరాజని చిక్కుల్లో పడ్డారు. బ్రిటిష్ రాక్ బ్యాండ్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి బ్లాక్ టికెట్లు విక్రయించినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో ఆయనకు ముంబై పోలీసులు తాజాగా మరోసారి సమన్లు జారీ చేశారు. టికెట్ల వ్యవహారంపై వివరణ కోరుతూ ముంబై పోలీసు ఎనకామిక్ అఫెన్సెస్ వింగ్ శనివారం అశీష్‌తో పాటు కంపెనీ టెక్నికల్ హెడ్‌కు సమన్లు పంపిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అయితే, తాజాగా మరోసారి సమన్లు పంపారు. విచారణ అధికారి ఎదుట హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. అయితే వీరిద్దరూ పోలీసులతో టచ్‌లో లేరని సమాచారం. కాగా, వచ్చే ఏడాది జనవరి 19 నుంచి 21 వరకు నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో కోల్డ్ ప్లే కార్యక్రమం జరగనుంది. బ్రిటిష్ రాక్‌బ్యాండ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కన్సర్ట్‌కు అనూహ్య స్పందన వస్తోంది. దీంతో బ్లాక్‌లో ఈ ప్రోగ్రామ్ టికెట్ల విక్రయం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. న్యాయవాది అమిత్ వ్యాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.2,500 ఉండే కోల్డ్‌ప్లే టికెట్ ధరను థర్డ్ పార్టీ ద్వారా ఏకంగా రూ.3 లక్షలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అభిమానులను మోసం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేయాలని కోరారు. న్యాయవాది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. ఇందులో భాగంగానే బుక్‌మైషో కంపెనీ సీఈవోతోపాటు కంపెనీ టెక్నికల్ హెడ్‌కు సమన్లు పంపారు. మరోవైపు ఈ ఆరోపణలపై బుక్‌మై షో వివరణ ఇచ్చింది. అనధికారికంగా టికెట్లు విక్రయించిన వారితో తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. కోల్ట్ ప్లే కన్సర్ట కోసం సెప్టెంబర్ 22న బుక్‌మైషోలో టికెట్ విక్రయాలు ప్రారంభమైనట్లు తెలిపింది. ఈ సంగీత కచేరీకి అనూహ్య స్పందన వచ్చినట్లు పేర్కొంది. బుకింగ్స్ ప్రారంభమైన రోజే ఏకంగా 1.2 మిలియన్ల మంది టికెట్ బుకింగ్ కోసం లాగిన్ అయినట్లు వివరించింది. దీంతో ప్రతి అభిమానికీ టికెట్లు అందాలనే ఉద్దేశంతో ఒక్కొక్కరు 4 టికెట్లు మాత్రమే కొనుగోలు చేసేందుకు పరిమితి విధించినట్లు వివరణ ఇచ్చింది.


## కోహ్లర్ భారతదేశంలో మొట్టమొదటి స్టూడియో కొహ్లర్ ప్రారంభం

### హైదరాబాద్‌లో లగ్జరీ డిజైన్, ఇన్నోవేషన్‌కు సరికొత్త సంగమం




**హైదరాబాద్-నవభూమి:** బాత్ కిచెన్ సొల్యూషన్స్‌లో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కోహ్లర్ భారతదేశంలో తన మొట్టమొదటి స్టూడియో కోహ్లర్‌ను ప్రారంభించడంతో హైదరాబాద్ విలాసవంతమైన, ఆవిష్కరణలలో కొత్త మైలురాయిని నెలకొల్పింది. భారతదేశంలో బాత్రూమ్ డిజైన్ ఫిట్టింగ్‌లను పునర్నిర్వచించేందుకు నగరం నడిబొడ్డున బంజారాహిల్స్, రోడ్ నెం.2, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న దీన్ని ఏర్పాటు చేయగా, ఈ స్థలం ప్రేరణ, కళను మిళితం చేసే, ఆవిష్కరణల కేంద్రంగా మారింది. స్టూడియో కోహ్లర్ ఒక లీనమయ్యే ఉత్పత్తుల సమాహారాన్ని అందిస్తుంది. ఇక్కడ ఆర్కిటెక్ట్‌లు, డిజైనర్లు వివేకవంతులైన వినియోగదారులు అసాధారణమైన ఉత్పత్తులను ఎంపిక చేసుకునేందుకు, సృజనాత్మక సంభాషణలో పాల్గొనడం, డిజైన్ విజన్‌లకు జీవం పోసేందుకు అవకాశం ఉంటుంది. ఈ సందర్భంలో కోహ్లర్ కో - చైర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డేవిడ్ కోహ్లర్ మాట్లాడుతూ, "మా డిజైన్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తూ, భారతదేశంలో మా మొట్టమొదటి స్టూడియో కొహ్లర్‌ను ప్రారంభించడం పట్ల మేము సంతోషిస్తున్నాము. ఈ ప్రాంతం భారతదేశంలోని మా వినియోగదారులకు అసాధారణమైన అనుభవాలను అందించడంలో మా లోతైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. వారి సౌందర్యాన్ని ప్రతిబింబించే వ్యక్తిగతీకరించిన స్థలాన్ని వారు క్యూరేట్ చేసే గమ్యస్థానాన్ని వారికి అందజేస్తుంది. మేము మా ఉనికిని విస్తరించడాన్ని కొనసాగిస్తున్నప్పుడు, మేము డిజైన్ కమ్యూనిటీని స్టైల్, లగ్జరీ ఫంక్షనాలిటీ యొక్క ఎక్స్‌ప్రెషన్‌లుగా మార్చడానికి డిజైన్ కమ్యూనిటీని ప్రోత్సహించడానికి ఆసక్తిగా ఉన్నాము. అన్నింటికి మించి సాటిలేని మేటి నాణ్యత అందించడంలో కోహ్లర్ ప్రసిద్ధి చెందింది" అని వివరించారు. దీనికి గురించి సలీల్ సదానందన్ - కోహ్లర్‌లో -సౌత్ ఏషియా - ఆసియా విభాగం అధ్యక్షుడు మరింత వివరిస్తూ, మా మొదటి స్టూడియో కోహ్లర్‌ను ప్రారంభించడంతో, మేము లగ్జరీ డిజైన్‌కు సంబంధించిన ప్రత్యేకమైన అన్వేషణను అందిస్తున్నందుకు సంతోషిస్తున్నాము. మా అభివృద్ధికి దక్షిణాది మార్కెట్ చాలా అవసరం. హైదరాబాద్-తన శక్తివంతమైన సాంస్కృతిక వారసత్వం, అత్యాధునిక ఆవిష్కరణలను వేడుకగా జరుపుకుంటూ, ఈ ప్రారంభానికి సరైన సెట్టింగ్‌ను అందిస్తుంది. ఈ కొత్త స్థలం విలాసవంతమైన జీవనానికి కొత్త ప్రమాణాన్ని నిర్దేశిస్తుందని శుద్ధి చేసిన చక్కదనానికి చిహ్నంగా మారుతుందని మేము విశ్వసిస్తున్నాము" అని ధీమా వ్యక్తం చేశారు. స్టూడియో కోహ్లర్ ప్రారంభం అనేది, కోహ్లర్ వినూత్న ఉత్పత్తుల ద్వారా డిజైన్, లగ్జరీ కలయికను చూసేందుకు గౌరవనీయులైన ఆర్కిటెక్ట్‌లు, ఆర్ట్ క్యూరేటర్లు, డిజైన్ ఔత్సాహికులు జీవనశైలి అభిమానులను ఒకచోట చేర్చింది. ఈ ప్రాంతం ఒక ఇంటరాక్టివ్ జోన్‌ను కూడా కలిగి ఉంది. ఇక్కడ సందర్శకులు ఉత్పత్తులను కోహ్లర్ రంగులు, ఫినిషింగ్‌ల బలమైన వారసత్వాన్ని ప్రయోగాత్మక వాతావరణంలో అనుభవించవచ్చు. రి బాత్‌రూమ్ డిజైన్‌లో కొత్త అవకాశాలను ఊహించవచ్చు. కోహ్లర్ సౌత్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్ రంజీత్ ఓక్ మాట్లాడుతూ, "మా వినియోగదారులకు వారి డిజైన్ సెన్సిబిలిటీకి అనుగుణంగా విస్తృత శ్రేణి అత్యాధునిక బాత్ స్పేస్ సొల్యూషన్‌లను కనుగొనేలా ఈ ప్రత్యేకమైన స్టూడియోను ప్రారంభిస్తుందని తెలిపారు. మేము వారికి స్ఫూర్తిని అందించాలని, వారి ఆకాంక్షలను వాస్తవంగా మార్చాలని, నిజమైన పరివర్తన అనుభవాన్ని అందించాలని ఆశిస్తున్నాము" అని తెలిపారు.

# 62% మంది ఒప్పో వినియోగదారుల సంతృప్తి




**న్యూఢిల్లీ-నవభూమి:** అసమాన మైన సేవా అనుభవాన్ని అందిం చాలనే తన నిబద్ధతకు అనుగుణం గా, ఒప్పో ఇండియావి క్రయాల అనంతరం సేవలు అందిస్తూ వినియోగదారుల సంతృప్తిలో %No% 1 స్థానాన్ని సంపాదిం చింది. తన వినియోగదారులలో 62% మంది తమ స్టోర్‌లో అమ్మకాల అనంతరం సేవ విషయంలో 'చాలా సంతృప్తికరంగా ఉన్నాము' అని రేటింగ్ ఇచ్చారు. ఆగస్టు 2024లో, కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ భారతదేశంలోని మొదటి ఐదు స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌లకు సంబంధించి 2,000ం మంది వినియోగదారులతో వారి విక్రయాననంతర సేవా అనుభవాలను కొలిచేందుకు ఒక సమీక్షను నిర్వహించింది. ఈ గుర్తింపు ఒప్పో ఇండియానూతన తరం కేంద్రాల ద్వారా సేవా అనుభవాన్ని పెంపొందించేందుకు వినియోగదారుడే-మొదట అనే విధానాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ సమీక్షను ఒప్పో ఇండియా, రియల్ మీ శాంసంగ్ఎ వీవో జీయోమీ వినియోగదారులకు 13 టైర్ 1 టైర్ 2 నగరాల్లో నిర్వహించారు. మరమ్మత్తు, నాణ్యత, ఖర్చులు, రిజల్యూషన్ వేగం, పారదర్శకత, సిబ్బంది నైపుణ్యం బహుభాషా కమ్యూనికేషన్ వంటి కీలక అంశాలలో ఒప్పో ఇండియా 'చాలా సంతృప్తి చెందిన' వినియోగదారులతో ముందంజలో నిలిచింది.

**అమ్మకాల తర్వాత అనుభవం**: 62% ఒప్పో ఇండియా కస్టమర్‌లు అమ్మకాల తర్వాత సర్వీస్ సెంటర్ అనుభవంతో 'చాలా సంతృప్తి చెందారు', ఆ తర్వాత వరుసగా వీవో శాంసంగ్ 58% 57% ఉన్నారు.

పారదర్శకత: ఒప్పో ఇండియా పారదర్శకతలో ముందంజలో ఉంది, 78% మరమ్మతులు వినియోగదారుల సమక్షంలో నిర్వహించగా, జీయోమీ 77%తో దగ్గరగా ఉంది.

**రిజల్యూషన్ వేగం:** ఒప్పో ఇండియా తన 35% వినియోగదారులకు ఒక గంటలోపు సమస్యలను పరిష్కరించడంలో ముందుండగా, శాంసంగ్ కన్నా 34% ముందుంది.

రిపేర్ నాణ్యత: 57% ఒప్పో ఇండియా వినియోగదారులు మరమ్మతుల నాణ్యతతో అధిక సంతృప్తిని వ్యక్తం చేయగా, ఆ తదుపరి స్థానంలో నిలిచి vivo 52% వద్ద ఉంది.

**సమస్యను పరిష్కరించడానికి అయ్యే ఖర్చు:** 51% ఒప్పో ఇండియా వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్‌లతో సమస్యను పరిష్కరించే ఖర్చు విషయంలో చాలా సంతృప్తి చెందగా, తర్వాత ఒప్పో జీయోమీ 45% మేర ఉన్నాయి. బహుభాషా మద్దతు: 48% ఒప్పో ఇండియా వినియోగదారులు బ్రాండ్‌లలో అత్యధికంగా ఇంగ్లీష్ హిందీ కాకుండా ఇతర భాషలలో సేవా ప్రతినిధులతో సంభాషించారు. స్టాఫ్ నాలెడ్జ్: 56% ఒప్పో ఇండియా వినియోగదారులకు సమస్యకు సంబంధించి సిబ్బందికి ఉన్న జ్ఞానంతో చాలా సంతృప్తి చెందారు. అదే విధంగా శాంసంగ్ వీవో తలా 49% మేర ఉన్నాయి. విశ్వసనీయత: "విశ్వసనీయత" "నిజమైన" అనేవి ఒప్పో ఇండియాను వివరించేందుకు ఉపయోగించే అత్యంత ప్రజాదరణ పొందిన పదాలు. సర్వీస్ సెంటర్ లొకేషన్: సర్వీస్ సెంటర్ లొకేషన్ (51%)తో చాలా సంతృప్తి చెందామని సమీక్షకు స్పందించిన వారిలో ఎక్కువ మంది వాటాతో ఒప్పో ఇండియా మెరుగ్గా ఉండగా, తర్వాత vivo 46%తో ఉంది. "ఒప్పో ఇండియాలో, సర్వీస్ సెంటర్ 3.0 OPPO సెల్ఫ్-హెల్ప్ అసిస్టెంట్ వంటి చర్యల ద్వారా మా వినియోగదారులకు అందించేందుకు మేము మా విక్రయాననంతర సర్వీస్ మోడల్‌ను మార్చాము" అని ఒప్పో ఇండియాలో ప్రోడక్ట్ కమ్యూనికేషన్స్ హెడ్ %Savio D Souza% nH •sÁT. "విక్రయాల తర్వాత వినియోగదారుని సంతృప్తిలో భారతదేశంలో 1 బ్రాండ్‌గా గుర్తింపు పొందడం అనేది మా వినియోగదారులకు సమయానుకూలంగా, పారదర్శకంగా, విశ్వసనీయంగా ఖర్చుతో కూడిన అనుభవాన్ని అందించడానికి మా ప్రయత్నాలను ఇది ధృవీకరిస్తుంది" అని వివరించారు. నేడు, ఒప్పో ఇండియా విక్రయాల అనంతరం మద్దతు 25000ం పిన్ కోడ్‌లలో 500ం నగరాల్లో 560ం ప్రత్యేక సేవా కేంద్రాలను విస్తరించింది భారత ప్రభుత్వం 'రిపేర్ హక్కు' ఫ్రేమ్‌వర్క్‌తో అనుసంధానించబడిన డిజిటల్-నేతృత్వంలోని సెల్ఫ్-హెల్ప్ అసిస్టెంట్ ద్వారా అభినందనలు అందుకుంది. అదే విధంగా ఒప్పో ఇండియా మార్చి 2024లో OPPO సెల్ఫ్-హెల్ప్ అసిస్టెంట్‌ను ప్రారంభించింది. ఈ డిజిటల్ సేవ వినియోగదా రులను సేవా కేంద్రాన్ని సందర్శించకుం డానే వారి స్మార్ట్‌ఫోన్ సమస్యలను పరిష్కరించుకునేం దుకు అనుమతిస్తుంది. ఈ మొదటి-రకం చొరవ గత ఐదేళ్లలో విడుదలైన అన్ని ఒప్పో హ్యాండ్‌సెట్‌లు-A, F, K, Reno Find Series లను కవర్ చేస్తుంది. అలాగే ఒప్పో ఇండియా తన కొత్త తరం 3.0 సర్వీస్ సెంటర్‌లను 2022లో ప్రవేశపెట్టింది, అమ్మకాల తర్వాత పారదర్శక సేవా అనుభవాన్ని అందించడంపై దృష్టి సారించింది. ఈ సేవా కేంద్రాలను సందర్శించే వినియోగదారులకు పూర్తి పారదర్శకత కోసం ఉత్పత్తుల ప్రదర్శనలు ముఖాముఖి మరమ్మతులను చూడవచ్చు.

## పంట రక్షణ కోసం గోద్రెజ్ ఆగ్రోవెట్ ప్రారంభించిన వ్యవసాయ సలహా హెల్ప్‌లైన్ -"హలో గోద్రెజ్"




**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశంలోని అతిపెద్ద, వైవిధ్యభరితమైన ఆహార వ్యవసాయ-వ్యాపార సంస్థలలో ఒకటైన గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (జీఏవీఎల్), పంట రక్షణకు వాస్తవ -సమయం లో ఫోన్ కాల్ ద్వారా నిపుణుల సలహాలను అందించడానికి బహుభాషా వ్యవసాయ సలహా హెల్ప్‌లైన్ 'హలో గోద్రెజ్'ను ఇటీవల ప్రారంభించినట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రాంతీయ భాషల్లో - హిందీ, మరాఠీ, కన్నడ, తెలుగు, తమిళం, బెంగాలీ, పంజాబీ, ఇంగ్లీషు భాషల్లో - రైతులకు అందుబాటులో ఉండేలా రూపొందించిన , ఈ కొత్త కార్యక్రమం, రైతులకు పూర్తి చేయూత అందించటం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచాలనే కంపెనీ ప్రయత్నాలకు అనుగుణంగా, రైతులకు అవసరమైనప్పుడల్లా ఒక్క కాల్ దూరం లో అందుబాటు ఉంటుంది. ఈ కార్యక్రమం గురించి గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్ సింగ్ యాదవ్ మాట్లాడుతూ, "గోద్రెజ్ ఆగ్రోవెట్ వద్ద మేము చేసే ప్రతి పనిలో రైతు కుటుంబాల అభ్యున్నతి ప్రధానమైనది. మంచి దిగుబడి కోసం సరైన సమయంలో సరైన పరిష్కారాల లభ్యత వినియోగం తప్పనిసరి అయినందున, వాస్తవ -సమయంలో వ్యక్తిగతీకరించిన పరిష్కారాలను అందించడం ద్వారా రైతులు వ్యవసాయ నిపుణుల మధ్య అంతరాన్ని తగ్గించడంలో "హలో గోద్రెజ్" మాకు సహాయం చేస్తుంది." అని అన్నారు.

మారుతున్న వాతావరణ పరిస్థితులు, చీడపీడల బెడద రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇటువంటి నిరంతరంగా అభివృద్ధి చెందుతున్న వ్యవసాయ పరిస్థితుల మధ్య, రైతులు తాజా పంట రక్షణ పరిష్కారాలను వారు ఇష్టపడే భాషలో వ్యక్తిగతీకరించిన మార్గదర్శకాలను పొందేందుకు వీలు కల్పించడం ఇప్పుడు తక్షణ అవసరం. "హలో గోద్రెజ్" ద్వారా భారతదేశం అంతటా రైతులు ఇప్పుడు మా వ్యవసాయ నిపుణుల బృందం నుండి ప్రత్యక్ష సంభాషణ ద్వారా వాస్తవ సమయంలో సలహాలను పొందవచ్చు." పర్యావరణ అనుకూల లాభదాయకమైన వ్యవసాయం వైపు వారి ప్రయాణంలో భారతీయ రైతులకు అత్యంత విశ్వసనీయ భాగస్వామిగా ఉండాలనే కంపెనీ లక్ష్యంని "హలో గోద్రెజ్" ప్రతిబింబిస్తుంది. గోద్రెజ్ ఆగ్రోవెట్ యొక్క విస్తృతమైన అనుభవం ఖ్యాతి పై ఆధారపడి, రైతులతో బలమైన, నమ్మకమైన సంబంధాలను ఏర్పరచుకోవడం, వ్యవసాయ రంగంలో దాని నాయకత్వాన్ని పటిష్టం చేయడం ద్వారా విశ్వసనీయ వ్యవసాయ సమాచారం కోసం గో-టు సోర్స్‌గా మార్చడం ఈ కార్యక్రమ లక్ష్యం," అని గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ వద్ద క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సీఈఓ రాజవేలు ఎన్ కె తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా, రైతు కుటుంబాలను ఉద్ధరించడానికి నాణ్యమైన నమ్మదగిన ఉత్పత్తులను అందించాలనే గోద్రెజ్ ఆగ్రోవెట్ యొక్క దీర్ఘకాల నిబద్ధతతో , రైతుల ప్రత్యేక అవసరాలు సవాళ్లను పరిష్కరించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న రైతులను చేరుకోవాలని కంపెనీ భావిస్తోంది.

# నేటి నుంచి అమల్లోకి కొత్త రూల్స్..

## ఏవేవి మారనున్నాయంటే..!



**న్యూఢిల్లీ-నవభూమి:** సెప్టెంబర్ నెల ముగియనుంది. నేటి నుంచి అక్టోబర్ ప్రారంభమవుతుంది. అక్టోబర్ 1వ తేదీ నుంచే మ్యూచువల్ ఫండ్స్, ఆధార్ కార్డ్, టీడీఎస్, స్మాల్ సేవింగ్ స్కీమ్, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డులకు సంబంధించిన నియమాలలో చాలా మార్పులు రానున్నాయి. మారిన నియమాలకు సంబంధించిన వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం..

ఆధార్ నెంబర్‌కు బదులుగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీని వెల్లడించడానికి సంబంధించిన నిబంధనను నిలిపివేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ రూల్ అక్టోబర్ 1 నుంచే అమలులోకి వస్తుంది. కాబట్టి ఎవరైనా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేస్తున్నప్పుడు పాన్ కేటాయింపు పత్రాలలో తమ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీని వెల్లడించాల్సిన అవసరం లేదు. సక్రమంగా లేని పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్స్, సుకన్య సమృద్ధి యోజన, పోస్టాఫీసుల ద్వారా పనిచేసే ఇతర చిన్న పొదుపు పథకాల క్రమబద్ధీకరణ కోసం కొత్త నియమాలు 2024 అక్టోబర్ 1 నుంచి అమలులోకి వస్తాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్ 2024లో ఆదాయపు పన్నుకు సంబంధించిన కొన్ని మార్పులను ప్రవేశపెట్టారు. ఇవన్నీ అక్టోబర్ 1 నుంచి అమలులోకి వస్తాయి. జీవిత బీమా పాలసీ, లాటరీ టిక్కెట్ల విక్రయంపై కమిషన్, కమిషన్ లేదా బ్రోకరేజీ చెల్లింపులు, హెచ్‌యూఎఫ్‌లు చేసే అద్దె చెల్లింపులు వంటి వాటికి సంబంధించిన టీడీఎస్ రేట్లు తగ్గుతాయి. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌కి వర్తించే సెక్యూరిటీస్ ట్రాన్సక్షన్ ట్యాక్స్ అక్టోబర్ 1 నుంచి పెరగనుంది. దాంతోపాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ రూల్స్, ఐసీఐసీఐ బ్యాంక్ డెబిట్ కార్డ్ ఛార్జీలు, మ్యూచువల్ ఫండ్స్ వంటి వాటిలో కూడా మార్పులు ఏర్పడతాయి.

## చిన్న పెట్టుబడి.. పెద్ద రాబడి.. మహిళా సాధికారతే లక్ష్యంగా ఎంఎస్ఎస్‌సీ



**న్యూఢిల్లీ-నవభూమి:** మీరు ఒక మహిళ అయితే, నమ్మకమైన రిటర్నులతో సురక్షిత పెట్టుబడిని కోరుకుంటున్నైటైతే.. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ)ను తీసుకోవచ్చు. కనీస పెట్టుబడి రూ.1,000 నుంచి మొదలవుతుంది. వడ్డీరేటు కూడా 7.5 శాతంగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న చాలా ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు) లేదా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్స్ (పీపీఎఫ్)లపై పొందే వడ్డీలకన్నా ఇది ఎక్కువే. అంతేగాక తమ ఆడబిడ్డల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు లేదా సంరక్షకులకున్న అత్యుత్తమ పెట్టుబడి సాధనంగానూ దీన్ని పేర్కొనవచ్చు. దీనికి రెండేండ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. దీంతో చదువు కోసం పొదుపు, చిరు వ్యాపారాల కోసం ప్రణాళికల వంటి స్వల్పకాలిక ఆర్థిక లక్ష్యాల సాధనకూ చక్కగా ఉపయోగపడుతుందనే చెప్పాలి.

**ఏమిటి ఈ పథకం?**

మహిళా సాధికారతే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. మహిళలు, ఆడపిల్లల అవసరాలకు పొదుపును ప్రోత్సహించడంలో భాగంగా 2023 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంను ప్రారంభించింది. ఇందులో సురక్షిత, అధిక రాబడిగల పెట్టుబడులకు అవకాశాలుంటాయి. అయితే ఈ స్కీం పరిమిత కాలమే అందుబాటులో ఉంటుంది. వచ్చే ఏడాది మార్చిదాకే లభిస్తుంది.

ప్రధాన ఫీచర్లు..

వార్షిక వడ్డీరేటు: 7.5 శాతం. ప్రతీ మూడు నెలలకోసారి లెక్కించి జమ చేస్తారు.

అర్హత: మహిళలు, ఆడపిల్లలకు మాత్రమే ఈ స్కీంలో పెట్టుబడికి వీలుంటుంది. మైనర్ల కోసం తల్లిదండ్రులు, వారి సంరక్షకులూ ఈ పథకాన్ని తీసుకోవచ్చు.

కాలపరిమితి: రెండేండ్లు. స్వల్పకాలిక లక్ష్యాలకు ఇది చక్కని సాధనం.

పెట్టుబడి: కనిష్ఠం రూ.1,000. గరిష్ఠం రూ.2 లక్షలు. ఒకేసారి డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

**ఏమిటి దీని ప్రత్యేకత?**

ఈ పథకంలో పెట్టుబడులపై ఏటా గరిష్ఠంగా 7.5 శాతం వడ్డీరేటును పొందవచ్చు. సేవింగ్స్ అకౌంట్స్, ఎఫ్‌డీలు, పీపీఎఫ్‌లతో పొందే వడ్డీరేటు కంటే ఇది ఎక్కువ. పీపీఎఫ్‌లో కూడా 7.1 శాతం వడ్డీరేటే వస్తున్నది. మహిళా సాధికారత దృష్ట్యానే ఈ స్కీంకు అన్నింటి కంటే ఎక్కువ వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నారు.

పెట్టుబడి మొదలైన ఏడాది తర్వాత అందులో 40 శాతం వరకు తిరిగి వెనక్కి తీసుకునే వెసులుబాటు ఈ పథకంలో ఉన్నది. అత్యవసర సమయాల్లో ఈ సొమ్మును వాడుకోవచ్చు. అలాగే ఇది కేంద్ర ప్రభుత్వ పథకం. కాబట్టి అత్యంత సురక్షితమైన పెట్టుబడిగా దీన్ని పేర్కొనవచ్చు. నిర్భయంగా మహిళలు తమ కష్టార్జితాన్ని ఇందులో మదుపు చేయవచ్చు.

**ఎలా పెట్టుబడి పెట్టాలి?**

పోస్టాఫీస్ లేదా ప్రభుత్వ రంగ బ్యాంకులో ఖాతా ద్వారా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో పెట్టుబడులకు దిగవచ్చు. పోస్టాఫీసుల్లోనైతే దగ్గర్లోని పోస్టాఫీస్‌కు వెళ్లి అక్కడ ధరఖాస్తు ఫారంను నింపాలి. మీ వ్యక్తిగత వివరాలు, పెట్టుబడి మొత్తంతోపాటు ఆధార్, పాన్, చిరునామా తదితర అవసరమైన ఇతర కేవైసీ డాక్యుమెంట్లను సమర్పించాలి. పెట్టుబడి మొత్తాన్ని నగదుగానైనా చెక్కు రూపంలోనైనా ఇవ్వవచ్చు. దీంతో ఎంఎస్ఎస్‌సీని అందుకోవచ్చు

బ్యాంకుల్లోనైతే మీకు దగ్గర్లోని ప్రభుత్వ బ్యాంకుల శాఖలకు వెళ్లి అప్లికేషన్ ఫారాన్ని నింపి, కేవైసీ డాక్యుమెంట్ల జీరాక్స్‌లను సమర్పించాలి. నగదు, చెక్కు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చు. ప్రాసెసింగ్ అనంతరం సర్టిఫికెట్ మీ చేతికి వస్తుంది. కాగా, పెట్టుబడి పెట్టిన 6 నెలల తర్వాత మీ ఖాతాను మీరు ముగించవచ్చు. కానీ వడ్డీరేటు 5.5 శాతమే వర్తిస్తుంది. రూ.2 లక్షలు పెట్టుబడిగా పెడితే రెండేండ్ల తర్వాత రూ.2,32,044 వస్తుంది.



# చైనా మహిళకు రెండు గర్భాశయాలు.. రెండింటి ద్వారా శిశువుల జననం



**న్యూఢిల్లీ-నవభూమి:** వైద్య చరిత్రలోనే ఇది అత్యంత అరుదైన ఘటన. మహిళ కడుపులో రెండు గర్భాశయాలు ఉండడమే వింతైతే.. రెండింటి ద్వారానూ పిల్లల్ని కనడం మరో వింత. చైనాలో సెప్టెంబర్‌లో జరిగిందీ ఘటన. వాయువ్య చైనాలోని షాంగ్జి ప్రావిన్స్‌కు చెందిన మహిళ సెప్టెంబర్‌లో సిజేరియన్ ఆపరేషన్ ద్వారా బాబు, పాపకు జన్మనిచ్చింది. ఇందులో ఎలాంటి వింత లేకపోయినా.. ఆమెకు రెండు గర్భాశయాలు ఉండడం, ఒకేసారి రెండింటి ద్వారానూ ఆమె గర్భం దాల్చడం, ఒకేసారి కవలలకు జన్మనివ్వడం అత్యంత అరుదని వైద్యులు చెప్తున్నారు. ప్రపంచంలో ఇలా 0.3 శాతం మాత్రమే జరుగుతుందని పేర్కొన్నారు. ఆమెలో పుట్టుకతోనే రెండు గర్భాశయాలు ఉన్నాయని, రెండూ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాయని గుర్తించారు. సహజ పద్ధతిలో ఒకేసారి రెండు గర్భాశయాల ద్వారా ఆమె గర్భం దాల్చడం చాలా అరుదని, ఇప్పటి వరకు ఇలాంటివి రెండే రెండు జరిగాయని, అందులో చైనాలో ఇది మొదటిదని వివరించారు. ఎనిమిదిన్నర మాసాల గర్భంతో ఉండగా ఆమె ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చిందని, బాబు 3.3 కేజీలు, పాప 2.4 కేజీల బరువుతో ఆరోగ్యంగా ఉన్నారని, నాలుగు రోజుల అనంతరం దవాఖాన నుంచి డిశ్చార్జ్ చేసినట్టు తెలిపారు.

## కారు వేగం తగ్గించమన్నందుకు... కానిస్టేబుల్‌ను ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన డ్రైవర్




**న్యూఢిల్లీ-నవభూమి:** : దేశ రాజధాని ఢిల్లీ రహదారులపై మరో దారుణం చోటుచేసుకుంది. ఓ కారు అతివేగంగా పోలీసు కానిస్టేబుల్‌ను ఢీకొట్టి ఈడ్చుకెళ్లింది. తలకు తీవ్ర గాయాలైన అతను ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మరణించాడు. వేగం తగ్గించమని ఆ కారు డ్రైవర్‌కు చెప్పడమే ఆ పోలీసు తప్పిదమైంది. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘోరం సీసీటీవీ కెమెరాలో రికార్డు అయింది. సందీప్ (30) అనే కానిస్టేబుల్ మఫ్టీలో నాంగ్లోయి ప్రాంతంలో మోటారు సైకిల్‌పై గస్తీ నిర్వహిస్తుండగా వెనుక నుంచి వ్యాగన్-ఆర్ కారు అతివేగంగా వస్తుండడాన్ని గమనించాడు. నెమ్మదిగా వెళ్లమని సైగ చేసి.. ముందుకు కదిలాడు. కానీ, ఆ కారు డ్రైవర్ మరింత వేగంగా పోనిచ్చి.. మోటారుసైకిల్‌పై ఉన్న సందీప్‌ను ఢీకొట్టి ఈడ్చుకెళ్లాడు.
దాంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే అతను ప్రాణాలు కోల్పోయాడు. ఆ కారులోని ఇద్దరు వ్యక్తులూ కారును వదిలేసి పరారయ్యారు. హత్య కేసు నమోదు చేసిన పోలీసులు నింది తుల కోసం గాలిస్తున్నారు. నిందితులి ద్దరిలో ఒకరు అక్రమ మద్యం వ్యాపారం చేస్తుంటాడని సమాచారం. కాగా, ఢిల్లీలో రోడ్డు ప్రమాదాలపై వాగ్వాదాలు హింసాత్మక ఘటనలకు దారితీసున్నాయి. గత నెల ఫరీదాబాద్‌లో తమ కారును తగిలాడనే కోపంతో ఆటోడ్రైవర్‌ను కొందరు వ్యక్తులు కొట్టి చంపారు. జూలైలో.. ఇలాగే రోడ్డుపై గొడవతో ఓ వ్యక్తి మోటారుసైకిల్‌పై ఇద్దరు పిల్లలతో కలిసి వెళుతున్న దంపతులపై కాల్పులు జరిపాడు. బుల్లెట్ తగిలి 30 ఏళ్ల మహిళ చనిపోయింది.

## 'ఆయుష్మాన్ భారత్'లో అర్హులైన వృద్ధులను చేర్చండి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం ఆదేశం




**న్యూఢిల్లీ-నవభూమి:** 'ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా' పథకంలో అర్హులైన వృద్ధులను చేర్పించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. 70 ఏళ్లు, ఆ పైన వయసున్న వారిని ఈ పథకంలో చేర్చాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ అదనపు కార్యదర్శి ఎల్.ఎస్.చాంగ్‌సాంగ్ అన్ని రాష్ట్రాలకు లేఖ రాశారు. ఈ పథకంలో వృద్ధుల నమోదుకు ఆయుష్మాన్ మొబైల్ యాప్, వెబ్ పోర్టల్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరాలనుకునే వృద్ధులు యాప్ లేదా పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఏడాదంతా ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ పథకం కింద సామాజిక, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఆరోగ్య బీమా (ఏడాదికి రూ.5 లక్షలు) వర్తిస్తుందని తెలిపారు. ఆధార్‌లో ఉన్న వయసు ఆధారంగా వృద్ధులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## యూపీలో రైల్వే ట్రాకుపై అగ్నిమాపక పరికరం



**న్యూఢిల్లీ, మహోబా-నవభూమి:** ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే ట్రాకులపై దుండగుల దుశ్చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ముంబై నుంచి లఖ్‌నవూ వెళ్తోన్న పుష్పక్ ఎక్స్‌ప్రెస్ లోకోపైలెట్ గోవిందపురి స్టేషన్ దగ్గరలో ఆదివారం సాయంత్రం 4.15 గంటలకు రైల్వేట్రాకుపై అగ్నిమాపక పరికరాన్ని(ఎర్రని సిలిండర్) గుర్తించి రైలుకి బ్రేకులు వేశారు. దీంతో దానికి కొద్ది దూరంలో రైలు ఆగింది. ఆ సమయంలో రైలు తక్కువ వేగంతో వెళుతుండడంతో ముప్పు తప్పిందని లోకోపైలెట్ తెలిపారు. కంట్రోల్‌రూమ్‌కి సమాచారం ఇచ్చాక దాన్ని కాన్పూర్ సెంట్రల్ స్టేషన్ తీసుకువచ్చారు. అది రైల్వేకి సంబంధించినఅగ్నిమాపక పరికరమేనని గుర్తించారు.ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు ఇదే రాష్ట్రంలో బాందా-మహోబా రైల్వే ట్రాకుపై శనివారం మధ్యాహ్నం కాంక్రీట్ స్తంభం ఉంచారు. దీంతో ఆ మార్గంలో వస్తోన్న పాసింజర్ రైలును లోకోపైలెట్ అత్యవసర బ్రేకులు వేసి నిలిపివేశారు. పోలీసులు, రైల్వే రక్షక దళ సిబ్బంది అక్కడికి చేరుకుని రైల్వేట్రాకుపై ఆ స్తంభాన్ని ఉంచిన 16 ఏళ్ల బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. యూపీలోని బైరియా ప్రాంతంలోనూ శనివారం ఉదయం ఇటువంటి ఘటనే చోటు చేసుకుంది.బైరియా ప్రాంతంలో రైల్వేట్రాకుపై ఉంచిన రాయిని రైలు ఇంజను ఢీకొంది. అయితే లోకోపైలెట్ అత్యవసర బ్రేకులు వేసి ఆపడంతో ఎటువంటి నష్టం వాటిల్లలేదని రైల్వే అధికారులు తెలిపారు. దీనికి కారకులను గుర్తించేందుకు రైల్వే రక్షక దళం ఆదివారం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. అంతేగాక ఆ మార్గంలో పెట్రోలింగ్ ఏర్పాటు చేశారు.

# సీనియర్ సిటిజన్లకు శుభవార్త.. మీ కోసం కొత్త రూల్స్.. ఇకపై రైళ్లలో మీరు..



**న్యూఢిల్లీ-నవభూమి:** : భారతదేశంలో రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. రోజుకు లక్షల మంది ప్రయాణం చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మహా నగరాలకు, పుణ్యక్షేత్రాలకు, పర్యాటక, ఇతర రాష్ట్రాల్లో నివసించే వారు స్వగ్రామాలకు రైళ్లలో వెళ్లేందుకు ఇష్టపడతారు. తక్కువ ఛార్జీతో ఎక్కువ దూరం ప్రయాణించే అవకాశం ఉండటమే ఇందుకు కారణం. అయితే వారికి సీట్లు దొరకడం అనేది పెద్ద ఛాలెంజ్ అనే చెప్పాలి. పండగల సమయంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఇక వృద్ధుల గురించి చెప్పాల్సిన అవసరమే లేదు. దూరం ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చి లోయర్ బెర్త్ దొరకకపోతే వారికి నరకం కనిపిస్తుంది. అయితే వారి సమస్యను తీర్చేందుకు రైల్వే శాఖ ముందుకొచ్చింది.
భారతీయ రైల్వే సీనియర్ సిటిజన్ ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. లోయర్ బెర్త్‌ల రిజర్వేషన్ కోసం ప్రత్యేక నిబంధనలు రూపొందించింది. దీని వల్ల 60ఏళ్లు పైబడిన పురుషులు, 45 ఏళ్లు పైబడిన మహిళలు ప్రయాణించేందుకు మార్గం సుగుమం చేసింది. ఇన్నాళ్లూ దిగువ బెర్త్ దొరకక వారి పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నయా రూల్స్ తెచ్చింది. సీనియర్ సిటిజన్ ఒంటరిగా లేదా మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి ప్రయాణించే సమయంలో లోయర్ బెర్త్ పొందే అవకాశం కల్పించింది. అలాగే ఓ వృద్ధుడు మధ్య లేదా ఎగువ బెర్త్ పొంది దిగువ బెర్త్ అందుబాటులో ఉంటే టికెట్ కలెక్టర్‌ను సంప్రదించి బదిలీ చేసుకోవచ్చని తెలిపింది. అయితే ఇద్దరి కంటే ఎక్కువ మందితో కలిసి ప్రయాణించేటప్పుడు దిగువ బెర్త్ పొందేందుకు ఈ అవకాశం లేదు. అయితే అలా పొందేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం..

**లోయర్ బెర్త్- ఇవి పాటిస్తే చాలు..**

సాధారణ సమయం సహా పండగల వేళ్లల్లో టికెట్ బుకింగ్ చేసేటప్పుడు సరైన నియమాలు పాటిస్తే వృద్ధులకు లోయర్ బెర్త్ పొందే అవకాశాలు ఉంటాయి. బుకింగ్ చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లు చేయవద్దు. అలా చేస్తే సీనియర్ సిటిజన్లు సరైన సీటు పొందలేరు. బుకింగ్ చేసేటప్పుడు అన్ని విషయాలపై అప్రమత్తంగా ఉండటం అవసరం.
టికెట్ బుక్ చేసే సమయంలో తప్పుకుండా మీరు సీనియర్ సిటిజన్ కోటా ఎంచుకోవాల్సి ఉంటుంది. మీరు %×=జుజ% వెబ్‌సైట్ లేదా ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల్లో రిజర్వేషన్ చేసే సమయంలో తప్పకుండా ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈ కోటా కింద వృద్ధులకు లోయర్ బెర్త్‌లు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
కొత్త నిబంధనల ప్రకారం వృద్ధులు ఒంటరిగా ప్రయణించకుండా లేదా ఇద్దరి కంటే ఎక్కువ మందితో ప్రయాణిస్తే లోయర్ బెర్త్ అవకాశం ఉండదు. అప్పుడు ఏ చేయాలంటే.. ఎక్కువ మందితో ప్రయాణించాల్సి వస్తే సీనియర్ సిటిజన్ టికెట్‌ను విడిగా బుక్ చేయడం మంచిది. దీని వల్ల వారు లోయర్ బెర్త్ పొందే అవకాశం ఉంటుంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో కూడా ఇతరులతో ప్రయాణించేటప్పుడు విడిగా బుక్ చేసుకోవడం మర్చిపోవద్దు.
టికెట్ బుకింగ్ సమయంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోండి. ముఖ్యంగా వృద్ధుల వయస్సును పూరించేటప్పుడు తప్పుగా నమోదు చేయ్యొద్దు. వారి నిజమైన వయస్సును మాత్రమే తెలపండి. తద్వారా లోయర్ బెర్త్ దొరికే అవకాశాలు ఉంటాయి. తప్పుగా నమోదు చేస్తే మీరు అవకాశాన్ని చేజేతులారా వదులుకున్నట్లే.
పండగల వేళ రైళ్లలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి రిజర్వేషన్ తెరిచిన వెంటనే బుక్ చేసుకోవడం ఉత్తమం. తద్వారా అందరి కంటే ముందే సీట్లు దొరికే అవకాశం ఉంటుంది. లోయర్ బెర్త్ కాకపోయినా కనీసం కన్ఫర్మ్ చేసిన బెర్త్ పొందే అవకాశాలైనా ఉంటాయి. ఏసీ క్లాస్ కంటే స్లీపర్ క్లాస్‌లో ఎక్కువ బెర్త్‌లు ఉంటాయి. కాబట్టి స్లీపర్ క్లాసులో బుక్ చేసుకోవడం వల్ల సీటు పొందడం సులభం అవుతుంది. అందుకే వీలైనంత ఎక్కువ బెర్త్‌లు ఉన్న చోటే రిజర్వేషన్ చేసుకోండి.

# హర్యానా, జమ్మూకశ్మీర్‌లో అధికారం కాంగ్రెస్‌దే



**న్యూఢిల్లీ-నవభూమి:** హర్యానాలోనూ, జమ్మూకశ్మీర్ లోనూ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ జైరామ్ రమేష్ అన్నారు. ఇటు హర్యానా, అటు జమ్మూకశ్మీర్‌లో ప్రధాన అంశాలు, పార్టీ వైఖరిని ఏఎన్ఐకి సోమవారంనాడిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన వివరించారు. %జై జవాన్, జైకిసాన్, జై పహెల్వాన్ "హర్యానాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం. బీజేపీపై పిడుగుపాటు పడనుంది. హర్యాలోని ప్రధాన అంశం...జై జవాన్, జై కిసాన్, జై పహెల్వాన్. అక్కడ జవాన్లు, రైతులకు అన్యాయం జరిగింది. రెజ్లర్లపై వివక్ష నడుస్తోంది. హర్యానాలో కాంగ్రెస్ పార్టీ నినాదం ఇదే" అని జైరామ్ రమేష్ తెలిపారు. రైతు రుణాల మాఫీ, 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన విధంగా కేంద్రం కుల గణన చేపట్టాలని కాంగ్రెస్ బలంగా చెబుతోందని తెలిపారు. కనీస మద్దతుధరకు చట్టబద్ధత కల్పించాలని తాము అడుగుతున్నామని, రైతులు డిమాండ్ చేసున్నది కూడా ఇదేనని అన్నారు. రైతులు తమ డిమాండ్‌తో చేపట్టిన నిరసనల్లో 700 మంది ప్రాణాలు కోల్పోయినప్పటికీ మోదీ మాత్రం తన మౌనం వీడలేదని తప్పుపట్టారు. మూడు సాగు చట్టాలను కేంద్ర వెనక్కి తీసుకుందని, అయితే ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించడం, రైతు రుణాల మాఫీ ఇంకా అలానే ఉన్నాయన్నారు.
జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ
జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తుందనే నమ్మకం తమకుందని జైరామ్ రమేష్ చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధించాల్సిన అవసరం ఉందన్నారు. పీడీపీతో ఎన్నికల పొత్తు అంశంపై మాట్లాడుతూ, 'ఇండియా కూటమి'లో పీడీపీ భాగస్వామి అని, అయితే ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుందని చెప్పారు. ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమి విజయం సాధించే వాతావరణం ఉందన్నారు. భారత్ జోడో యాత్ర తర్వాత కాంగ్రెస్‌కు ఆదరణ పెరిగిందని చెప్పారు. జమ్మూకశ్మీర్‌రకు రాష్ట్ర హోదా పునరుద్ధరణే తమ ప్రధాన డిమాండ్ అని, అందుకోసం పోరాడతామని తెలిపారు.

# నేపాల్‌లో కొనసాగుతున్న వరద బీభత్సం.. 200 మంది మృతి



**న్యూఢిల్లీ-నవభూమి:** పొరుగు దేశం నేపాల్ లో వరద బీభత్సం కొనసాగుతోంది. శుక్రవారం నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల కారణంగా తూర్పు, మధ్య నేపాల్‌లో ఆకస్మిక వరదలు పోటెత్తాయి. ఈ వరదలకు రాజధాని ఖాట్మండు సహా ఎనిమిది జిల్లాల్లో పెద్ద ఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఇప్పటి వరకూ అందిన సమాచారం ప్రకారం.. ఈ జల ప్రళయానికి దాదాపు 200 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 68 మంది గల్లంతవ్వగా.. వంద మందికిపైగా గాయపడ్డారు.
ఇక ఈ వరదలకు భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. వెయ్యికిపైగా ఇళ్లు, రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. భాగమతి నది ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తోంది. దీంతో సమీపంలోని గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. దేశవ్యాప్తంగా 44 జిల్లాల్లో వరదలు బీభత్సం సృష్టించాయి. పలు చోట్ల కొండచరియలు విరిగిపడటం లాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ కారణంగా రోడ్లు ధ్వంసమవడంతో.. 39 జిల్లాల్లో రహదారులను అధికారులు పూర్తిగా మూసివేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు. దాదాపు 3 వేల మందికిపైగా భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇప్పటి వరకు వెయ్యి మంది వరకు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

# బయానిక్ ఐతో అంధులకు చూపు.. ఆస్ట్రేలియా పరిశోధకుల అద్భుత ఘనత!



**న్యూఢిల్లీ-నవభూమి:** అంధులకు తిరిగి చూపు తెప్పించడంలో పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. ఆస్ట్రేలియాలోని మోనష్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ప్రపంచంలోనే మొదటి 'బయానిక్ ఐ'ని అభివృద్ధి చేశారు. 'గెన్నరిస్ బయానిక్ విజన్ సిస్టమ్'గా పిలుస్తున్న ఈ సాంకేతికత జంతువుల్లో విజయవంతమైంది. మనుషుల్లో విజయవంతమైతే చూపును కోల్పోయిన కోట్లాది మంది తిరిగి తమ దృష్టిని పొందవచ్చు. చికిత్స లేని అంధత్వానికి పరిష్కారం చూపడంలో ఈ సాంకేతికత విప్లవాత్మకంగా మారనుంది.
దశాబ్ద కాలంగా ఈ సాంకేతికతపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ అధునాతన వ్యవస్థ సాధారణంగా కంటి నుంచి మెదడుకు దృష్టి సమాచారాన్ని చెరవేసే నేత్ర నాడులను దాటి వెళ్లడం ద్వారా పని చేస్తుంది. ఇది నేరుగా మెదడులోని దృష్టి కేంద్రానికి సంకేతాలను పంపుతుంది. దీని వల్ల వినియోగదారుడు దృశ్యాలను చూడటానికి వీలవుతుంది. గొర్రెల్లో ఈ సాంకేతికతను ఉపయోగించినప్పుడు తక్కువ ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ఇప్పుడు మెల్‌బోర్న్‌లో ఈ సాంకేతికతను మనుషులపై ప్రయోగిస్తున్నారు.

**ఎలా పని చేస్తుంది?**

వైర్‌లెస్ ట్రాన్స్‌మిటర్, కెమెరాతో కూడిన హెడ్‌గేర్(తలపై ధరించే పరికరం)ను రోగులు ధరించాలి. ఈ మొత్తం సిస్టమ్‌లో చిన్న 9 ఎంఎం ఇంప్లాంట్స్ ఉంటాయి. విజువల్ డాటాను రిసీవ్ చేసుకుని, విశ్లేషించేందుకు వీటిని మెదడులో అమర్చుతారు. ఈ సాంకేతికత ద్వారా చూపును తిరిగి తెప్పించడంతో పాటు నరాల సమస్యలకు పరిష్కారాలు కనుక్కోవాలని పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు. మనిషి కన్ను అందించే 130 డిగ్రీల దృష్టి పరిధి కంటే కాస్త తక్కువగా ఈ కృత్రిమ కన్ను 100 డిగ్రీల వరకు దృష్టి పరిధిని అందిస్తుంది.

## వైద్య ఖర్చులు పైపైకి..!



**న్యూఢిల్లీ-నవభూమి:** పెరుగుతున్న ధరలు, ఇతర వ్యయాలతో నెలనెలా కుటుంబ బడ్జెట్ తలకిందులవుతోంది. వీటికితోడు ఇటీవల వైద్య ఖర్చులు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. భారత్‌లో ప్రజల ఆస్పత్రి ఖర్చులు ఏడాదికి 14% పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అకో (ఏసీకేవో) అనే బీమా సంస్థ రూపొందించిన తాజా నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ సంస్థ విడుదల చేసిన 'అకో ఇండియా హెల్త్ ఇన్సూరెన్స్ ఇండెక్స్-2024'... భారత్‌లో ఆరోగ్య ద్రవ్యోల్బణం 14 శాతంగా ఉందని, ఆరోగ్య సంరక్షణ వ్యయం ప్రతి ఏడాది 14% పెరుగుతోందని పేర్కొంది. 23% మంది ఈ ఆస్పత్రి చార్జీలను రుణాల ద్వారా సమకూర్చుకుంటున్నారని, ఇది ఆయా కుటుంబాలను విపరీతమైన ఆర్థిక కష్టాల్లోకి నెడుతున్నాయని నివేదిక పేర్కొంది. దేశంలో ఇంకా 68% మంది ఆరోగ్య ఖర్చులను తమ జేబు నుంచే చెల్లిస్తున్నారని తెలిపింది.దేశవ్యాప్తంగా నమోదవుతున్న ఆరోగ్య పాలసీ క్లెయిములను విశ్లేషించిన అకో.. మూత్ర పిండాల వ్యాధుల్లో దేశ రాజధాని ఢిల్లీ అగ్రస్థానంలో ఉన్నట్టు గుర్తించింది. కిడ్నీ చికిత్స క్లెయిములు ఇక్కడే ఎక్కువగా ఉన్నాయని, ఆ తర్వాతి స్థానం కొచ్చిదని తెలిపింది. కొచ్చితోపాటు హైదరాబా ద్, బెంగళూరు, జైపూర్‌లో దాఖలవుతున్న క్లెయిముల జాతీయ సగటు కంటే అధికంగా ఉందని తెలిపింది. కిడ్నీ చికిత్సలకు క్లెయిమ్ చేసే రోగుల సగటు వయ స్సు 47 ఏళ్లుగా ఉందని పేర్కొంది. మూత్రపిండాల ఆరోగ్యంతోపాటు గుండెజబ్బులు, ఇతర క్లిష్టమైన ఆరో గ్య సమస్యలను కూడా ఈ నివేదిక ఎత్తి చూపింది. గుండె జబ్బుల చికిత్స క్లెయిములు ఎక్కువగా నమోదైన నగరాల్లో కోల్‌కతా, ముంబై ముందువరుసలో ఉన్నాయని తెలిపింది. 2020 నుంచి 2024 మధ్యకాలంలో క్యాన్సర్ కేసులు 13% పెరిగాయని ఈ నివేదిక వెల్లడించింది.

## నాసా రెస్క్యూ మిషన్ విజయవంతం.. స్పేస్ స్టేషన్‌కు చేరిన స్పేస్‌ఎక్స్ క్రూ-9

**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన ఇద్దరు వ్యోమగాములు సునీతా విలియమ్స్, బారీ విల్‌మోర్‌లు త్వరలోనే భూమికి చేరనున్నారు. వారిని తీసుకొచ్చేందుకు స్పేస్-ఎక్స్ చేపట్టిన ప్రత్యేక మిషన్ విజయవంతమైంది. స్పేస్ ఎక్స్ పంపిన క్రూ-9 స్పేస్‌క్రాఫ్ట్ ఐఎస్ఎస్‌కి చేరింది. ఈ విషయాన్ని స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. డ్రాగన్ స్పేస్ స్టేషన్‌కు చేరినట్లు వెల్లడించారు. ఈ మేరకు వీడియోను పంచుకున్నారు.
కాగా, బోయింగ్ సంస్థ ఈ ఏడాది జూన్‌లో చేపట్టిన స్టార్‌లైనర్ స్పేస్ మిషన్ ద్వారా వ్యోమగాములు సునీతా విలియమ్స్ బుచ్ విల్‌మోర్ ఐఎస్ఎస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. అయితే తిరుగు ప్రయాణంలో బోయింగ్ స్టార్‌లైనర్‌లో సాంకేతిక లోపం తలెత్తటంతో ఇద్దరు వ్యోమగాములు గత 100 రోజులుగా అంతరక్షింలోనే ఉండిపోవాల్సి వచ్చింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ వారిద్దరూ అంతరిక్షంలోనే ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.వీరిని తిరిగి భూమికి తీసుకొచ్చేందుకు స్పేస్ ఎక్స్ ప్రత్యేక మిషన్ చేపట్టింది. ఇందులో భాగంగా శనివారం ఫ్లోరిడాలోని కేప్ కెనవెరాల్ నుంచి క్రూ-9 స్పేస్‌క్రాఫ్ట్‌ను అంతరిక్షంలోకి పంపింది. ఈ లాంచ్‌ప్యాడ్ నుంచి చేపట్టిన తొలి మానవ సహిత స్పేస్‌ఫ్లైట్ ఇదే. నాసా కమర్షియల్ క్రూ ప్రోగ్రాంలో భాగంగా స్పేస్-ఎక్స్ క్రూ-9 స్పేస్‌క్రాఫ్ట్‌ను ఐఎస్ఎస్‌కు పంపింది. ఈ స్పేస్ క్రాఫ్ట్ ద్వారా ఫిబ్రవరి 2025లో వ్యోమగాములు భూమికి తిరిగి రానున్నారు. ఈ స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ క్యాప్సూల్స్ నలుగురు ప్రయాణించొచ్చు. క్రూ మిషన్ కమాండర్‌గా నాసా నిక్ హేగ్, రష్యా రాస్కోస్మోస్ మిషన్ స్పెషలిస్ట్ అలెగ్జాండర్ గోర్బునోవ్ ఇందులో వెళ్లారు. వచ్చే సమయంలో సునీతా విలియమ్స్, బారీ విల్మోర్‌ని తిరిగి తీసుకువచ్చేందుకు రెండు సీట్స్‌ని ఖాళీగా ఉంచారు.



## సల్మాన్ ఖాన్, అట్లీ సినిమాకు కమల్ హాసన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేనా..?

జవాన్ సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ . ఈ లీడింగ్ డైరెక్టర్ బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తో తో మల్టీ స్టారర్ చేయబోతున్నట్టు ఇప్పటికే వార్తలు హల్ చల్ చేస్తున్న విషయం తెలిసిందే. చాలా రోజుల తర్వాత మరో క్రేజీ వార్త తెరపైకి వచ్చింది. ఈ చిత్రంలో ఉలగనాయగన్ కమల్ హాసన్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడని జోరుగా టాక్ నడుస్తోంది. అట్లీ 6 ప్రాజెక్ట్ చర్చలు తుదిదశలో ఉన్నాయని కోలీవుడ్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్.కాగా అట్లీ ప్రస్తుతం కమల్ హాసన్‌తో చర్చలు జరుపుతున్నాడట. కథానుగుణంగా డ్యుయల్ హీరో సబ్జెక్ట్ అని.. పక్కా పాన్ ఇండియా అప్పీల్‌తో సినిమా ఉండబోతుందని సమాచారం. ఈ చిత్రానికి అనిరుధ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించనున్నాడు. ఈ ప్రాజెక్ట్ దాదాపు ఫైనల్ కాగా.. మరో లీడ్ రోల్‌కు కమల్ హాసన్ గ్రీన్ సిగ్నల్ ఇస్తాడా..? లేదా అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. పాపులర్ ప్రొడక్షన్ హౌస్ సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనుందని వార్తలు వస్తుండగా.. దీనిపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. జవాన్ తర్వాత అట్లీ నుంచి రాబోతున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే నెలకొన్నాయి.కమల్ హాసన ప్రస్తుతం ఇండియన్ 3, థగ్ లైఫ్, కల్కి 2898 ఏడీ సీక్వెల్ సినిమాలతో బిజీగా ఉన్నాడు.





## ఐటం పాటల్లో పాండే బ్యూటీ కండీషన్లు!

ఐటం పాటలకు ఏ నటి ఒకే చెప్పినా? పెద్దగా కండీషన్లు అంటూ ఏవీ లేకుండానే నటిస్తున్నారు . ఐటం పాట అంటేనే యువతలో ఊపు తెచ్చేది. ఆపాటని కమర్శియల్ కోణంలో డిజైన్ చేసి సినిమాల్లో పెడు తుంటారు. ఆ పాట కోసం స్టోరీ డిమాండ్ చేయాల్సిన పనిలేదు. సన్నివేశానికి నాన్ సింక్ అవుతుంది? అనే అవసరం లేదు. కమర్శియల్ సినిమా అయినా..పీరియాడిక్ స్టోరీ అయినా హాట్ బ్యూటీతో ఐటం పాట అన్నది? ఓ స్పెషల్ గా భావిస్తారంతా. ! ఈ కల్చర్ దాదాపు అన్ని భాషల్లోనూ ఉంది. ముఖ్యంగా టాలీవుడ్..బాలీవుడ్..కోలీవుడ్లో కనిపిస్తుంటుంది. ఐటం పాటల్లో స్టార్ హీరోయిన్లే నటిస్తున్నారు. ఎలాంటి కండీషన్లు పెట్టకుండా అందాలు ఆరబోస్తున్నారు. హీరోయిన్లు ఇలాంటి టర్నింగ్ తీసుకోవడంతో ప్రొఫెషనల్ ఐటం గాళ్స్ కి డిమాండ్ తగ్గిందన్నది వాస్తవం. ఫాంలో ఉన్నా లేకపోయినా? మంచి పారితోషికం వస్తుందంటే నో చెప్పకుండా పనిచేస్తున్నారు. తాజాగా లైగర్ బ్యూటీ అనన్యా పాండే కూడా ఐటం పాటలకు గ్రీన్ సిగ్నెల్ ఇచ్చింది. అయితే అమ్మడు ఇక్కడ కండీషన్లు అప్లై అంటోంది. అన్ని సినిమాల్లోనూ ఐటం పాటల్లో నటించనని...కేవలం ఐటం పాటలు డిమాండ్ చేసే సినిమాలు తప్ప! మిగతా సినిమాల్లో అవకాశాలు వచ్చిన అలాంటి పాటలు చేయనంటోంది. పాటలో అమ్మాయికి ప్రాధాన్యతతో పాటు, దాన్ని గౌరవంగా భావించేలా ఉండాలి అంటోంది. అలాంటప్పుడే ఐటం పాటలో నటిస్తుందిట. తన నియమాలకు అనుగుణంగా ఐటం పాటలు వస్తే చేస్తాను తప్ప లేదంటే నిర్మొహమాటంగా నో చెప్పాస్తాను అంది.

## దేవుడిని రాజకీయాల్లోకి లాగకండి : ప్రకాష్ రాజ్



తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి పదవిలో ఉండి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. రాజ్యాంగ పదవిలో ఉన్నప్పుడు బాధ్యతగా ఉండాలి కదా అంటూ నిలదీసింది . కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశంపై రెండో ఒపీనియన్ తీసుకోకుండా ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి వ్యాఖ్యలు చేయడం, ఈ వ్యవహారంలో మీడియాకు వెళ్లాల్సిన అవసరం లేదని అభిప్రాయ పడింది.తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరుగగా.. ఈ విషయంపై ధర్మాసనం మాట్లాడుతూ.. నెయ్యి కల్తీ జరిగినట్టు గుర్తించిన తర్వాత , తయారైన లడ్డూలను టెస్టింగుకు పంపారా, లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధారించారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. కల్తీ నెయ్యితో లడ్డూలు తయారు చేసినట్లు ఆధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఇరువాదనలు విన్న కోర్టు కనీసం దేవుడినైనా రాజకీయాల నుంచి దూరం పెట్టాలని సూచించింది.అయితే ఈ వ్యాఖ్యలపై తాజాగా నటుడు ప్రకాశ్‌రాజ్ ట్విట్టర్ వేదికగా స్పందించాడు. "దేవుడిని రాజకీయాల్లోకి లాగకండి" అంటూ ట్విట్టర్ వేదికగా పోస్ట్ పెట్టాడు. తిరుమల లడ్డూ వివాదం వ్యవహారంలో సినీ నటుడు ప్రకాశ్ రాజ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్య డైలాగ్ వార్ సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

## నెట్‌ఫ్లిక్స్‌లోనూ అదే దూకుడు.. టాక్ ఆఫ్ ది టౌన్‌గా నాని సరిపోదా శనివారం..!



న్యాచురల్ స్టార్ నాని ఇటీవలే సరిపోదా శనివారం సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ వసూళ్లు రాబట్టింది. కాగా ఓ వైపు ఈ సక్సెస్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తూనే.. మరోవైపు కొత్త సినిమాల షూటింగ్స్‌తో బిజీగా మారిపోయాడు నాని. కాగా థియేటర్లలో అందరినీ ఇంప్రెస్ చేసిన ఈ చిత్రం సెప్టెంబర్ 26న నెట్‌ఫ్లిక్స్‌లోకి కూడా ఎంట్రీ ఇచ్చిందని తెలిసిందే.

ఎ నెట్‌ఫ్లిక్స్‌లోనూ అదే దూకుడు.. టాక్ ఆఫ్ ది టౌన్‌గా నాని సరిపోదా శనివారం..!

ఎ న్యాచురల్ స్టార్ నాని ఇటీవలే సరిపోదా శనివారం సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ వసూళ్లు రాబట్టింది. కాగా ఓ వైపు ఈ సక్సెస్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తూనే.. మరోవైపు కొత్త సినిమాల షూటింగ్స్‌తో బిజీగా మారిపోయాడు నాని. కాగా థియేటర్లలో అందరినీ ఇంప్రెస్ చేసిన ఈ చిత్రం సెప్టెంబర్ 26న నెట్‌ఫ్లిక్స్‌లోకి కూడా ఎంట్రీ ఇచ్చిందని తెలిసిందే.

ముందుగా ఊహించినట్టుగానే సరిపోదా శనివారం డిజిటల్ ఎంట్రీ ఇచ్చినప్పటి నుంచి నంబర్ 1 స్థానంలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది. సినిమాను థియేటర్లలో మిస్సయిన మూవీ లవర్స్, ఫ్యామిలీ ఆడియెన్స్ నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రాన్ని ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారని తాజా వార్త క్లారిటీ ఇచ్చేస్తుంది. ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందనడంలో ఎలాంటి సందేహం లేదు.మేకర్స్ ఇటీవలే సరిపోదా శనివారం నుంచి జేక్స్ బిజోయ్ కంపోజ్ చేసిన (ఓఎస్‌టీ) ఒరిజినల్ సౌండ్ ట్రాక్‌ను విడుదల చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో నాని 31గా తెరకెక్కిన ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయగా.. ఇతర భాషల్లో టైటిల్‌తో విడుదల చేశారు. ఈ మూవీలో గ్యాంగ్ లీడర్ ఫేం ప్రియాంక ఆరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటించగా.. కోలీవుడ్ స్టార్ యాక్టర్ ఎస్‌జే సూర్య కీలక పాత్రలో నటించాడు. యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ మూవీని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మించారు.

## తెలుగు ఆడియన్స్‌కు 'సత్యం సుందరం' నచ్చదు అనుకున్నా : కార్తీ



సత్యం సుందరం సినిమాతో సూపర్ హిట్ అందుకున్న సందర్భంగా తమిళ నటుడు కార్తీ విజయవాడలో నేడు సందడి చేశారు. ఈ మూవీ సాధించిన విజయం పట్ల కార్తీ, దర్శకుడు ప్రేమ్ కుమార్ విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఉదయం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు ఆశీర్వాదం అందించారు. అయితే దర్శనం అనంతరం మీడియాతో ముచ్చటించాడు కార్తీ.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చాలా మంచి రెస్పాన్స్ వస్తుంది. మొదట ఈ సినిమాను నేను తెలుగులో రిలీజ్ చేస్తామంటే వద్దు అన్నాను. ఒక ఫైట్ లేదు, సాంగ్స్ లేవు, డ్యాన్స్ లేవు అని చెప్పాను. అప్పుడు మా టీం మాట్లాడుతూ.. లేదు ఇది చాలా మంచి మూవీ ఆడుతుంది అన్నారు. ఇది చూసినప్పుడు తెలుగులో కే విశ్వనాథ్ గారి మూవీ లాగా ఉందని చెప్పారు. అలాగే ఇది పెద్దవాళ్లకి కాకుండా యూత్‌కి కూడా బాగా నచ్చుతుంది. చాలారోజుల తర్వాత ఇలాంటి సినిమాను చూస్తున్నాం అని చెబుతున్నారు. కుటుంబంతో కలిసి చూడదగ్గ సినిమా ఇది. ఈ సినిమాను ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు అంటూ తెలిపాడు. నా నెక్ట్స్ ప్రాజెక్ట్‌లు సర్దార్ 2 తో పాటు ఖైదీ 2 ఉన్నాయి అంటూ కార్తీ చెప్పుకొచ్చాడు.

## భారత్‌తో పొట్టి సిరీస్.. స్క్వాడ్‌లో విధ్వంసక ఆల్‌రౌండర్



**న్యూఢిల్లీ–నవభూమి:** భారత పర్యటనలో ఆఖరి టెస్టు ఆడుతున్న బంగ్లాదేశ్ ఆ తర్వాత టీ20 పోరుకు సన్నద్ధం అవుతోంది. అక్టోబర్ 6న పొట్టి సిరీస్ మొదలు కానున్న నేపథ్యంలో సోమవారం బంగ్లాదేశ్ క్రికెట్ బోరు స్క్వాడ్‌ను ప్రకటించింది. టెస్టులు, వన్డేలకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న నజ్ముల్ హుసేన్ శాంటో ఈ ఫార్మాట్‌లోనూ జట్టును నడిపించనున్నాడు.ఇక విధ్వంసక ఆల్‌రౌండర్ మెహిదీ హసన్ మిరాజ్, టీ20 వరల్డ్ కప్‌లో అద్భుతంగా రాణించిన యువకెరటం తౌహిద్ హృదయ్, పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌లను సెలెక్టర్లు ఎంపిక చేశారు. సీనియర్ ఆటగాడు మహ్మదుల్లా సైతం స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నాడు. బంగ్లాదేశ్ స్క్వాడ్ : నజ్ముల్ హుసేన్ శాంటో(కెప్టెన్), తంజిద్ హసన్ తమీమ్, పర్వేజ్ హెుసేన్ ఎమొన్, తౌహిద్ హృదయ్, మహ్మదుల్లా, లిట్టన్ దాస్, జకీర్ అలీ, మెహిదీ హసన్ మిరాజ్, షేక్ మహెదీ హసన్, రిషద్ హెుసేన్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, తస్కిన్ అహ్మద్, షోరిఫుల్ ఇస్లాం, తంజిమ్ హసన్ షకీబ్, రకిబుల్ హసన్.

## అంతర్జాతీయ క్రికెట్‌లో కోహ్లీ ప్రభంజనం.. వరల్డ్ రికార్డు బద్ధలైందిపో



**న్యూఢిల్లీ–నవభూమి:** రన్ మెషీన్‌గా పేరొందిన భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ మరో ఘనత సాధించాడు. నిరుడు 50వ వన్డే శతకంతో ప్రకంపనలు రేపిన విరాట్ అంతర్జాతీయ క్రికెట్‌లో 27 వేల పరుగుల మైలురాయికి చేరుకున్నాడు. అత్యంత వేగంగా ఈ క్లబ్‌లో చేరిన ఆటగాడిగా కోహ్లీ చరిత్ర సృష్టించాడు.కాన్పూర్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ధనాధన్ ఆడిన కోహ్లీ ఈ ఫీట్ సొంతం చేసుకున్నాడు. విరాట్ 594 ఇన్నింగ్స్‌ల్లోనే 27 పరుగుల క్లబ్‌లో చేరాడు. భారత లెజెండ్ సచిన్ టెండూల్కర్ 2007లో 623 ఇన్నింగ్స్‌ల్లో ఈ మైలురాయిని అందుకున్నాడు. కానీ.. మూడు ఫార్మాట్లలో (టెస్టులు, వన్డేలు, టీ20లు) అత్యుత్తమ క్రికెటర్‌గా కొనసాగుతున్న విరాట్ మాత్రం రాకెట్ వేగంతో దూసుకొచ్చాడు. తద్వారా ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యధిక పరుగుల వీరుల జాబితాలో నాలుగో స్థానం సాధించాడు.

## రాహుల్ మెరుపు హాఫ్ సెంచరీ.. ఆధిక్యంలో టీమిండియా



**న్యూఢిల్లీ–నవభూమి:** కాన్పూర్ టెస్టులో గెలుపే లక్ష్యంగా భారత ఆటగాళ్లు వీరకొట్టుడు కొడుతున్నారు. విరాట్ కోహ్లీ(47), కేఎల్ రాహుల్(51)లు ధనాధన్ ఆడడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. నాలుగో రోజు బంగ్లాను 233 పరుగులకే ఆలౌట్ చేసిన టీమిండియా ఎలాగైనా మ్యాచ్ గెలవాలనే కసితో ఆడుంతోంది. అందులో భాగంగానే ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(72) రోహిత్ శర్మ(23) మెరుపు బ్యాటింగ్‌తో బంగ్లా బౌలర్లపై విరుచుకుపడ్డారు.యశస్వీ అయితే.. తనదైన దూకుడుతో అర్ధ సెంచరీ బాదేయగా.. శుభ్‌మన్ గిల్(39) సైతం ఉన్నంత సేపు దంచాడు. దాంతో, 10.1 ఓవర్లనే భారత జట్టు 100 రన్స్ కొట్టి చరిత్ర సృష్టించింది. అనంతరం కోహ్లీ, రాహుల్‌లు విధ్వంసాన్ని తారాస్థాయికి చేరింది. ప్రస్తుతం భారత్ 13 పరుగుల ఆధిక్యంలో ఉంది.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**